www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 02 | శుక్రవారం | 31 జులై, 2026



మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

# ఉత్తరం అతలాకుతలం

## ముంచెత్తుతున్న ఎడతెరిపిలేని వానలు

- ఉధృతంగా గోదావరి, ప్రాణహిత
- జలాశయాలకు భారీగా పోటెత్తుతున్న వరద
- కడెం, మేడిగడ్డ, ఎస్సారెస్పీ వద్ద అధికారుల అప్రమత్తం
- తొమ్మిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- మరో మూడు రోజుల పాటు

రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక

2

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తుండగా, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరుతుండడంతో రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు జలకళను సంతరించుకుంటున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం మరో మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరిస్తూ తొమ్మిది జిల్లాలకు ఆరెంజ్, మరో ఆరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

– ప్రజానావ, హైదరాబాద్



## పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇకలేరు

- గుండెపోటుతో చికిత్స పొందుతూ యశోద ఆస్పత్రిలో కన్నుమూత
- ఐదు రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స
- ఫలించని వైద్యుల ప్రయత్నాలు
- తెలంగాణ ఉద్యమకారుడిగా, నర్సంపేట మాజీ ఎమ్మెల్యేగా విశిష్ట గుర్తింపు

**ప్రజానావ, హైదరాబాద్:** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి (51) గురువారం అర్ధరాత్రి కన్నుమూశారు. సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి 12.50 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 26న హనుమకొండలో ఆయనకు తీవ్ర గుండెపోటు రావడంతో తొలుత స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అనంతరం మెరుగైన వైద్యం కోసం యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. గుండెపోటు కారణంగా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన సుదర్శన్‌రెడ్డికి వైద్యులు అత్యవసర చికిత్స అందించి పలుమార్లు తరువాయి 2లో..



## చదువుల తెలంగాణే లక్ష్యం

- ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తాం
- ప్రైవేటుకు మించిన ప్రమాణాలు తీసుకొస్తాం
- విద్యారంగానికి బడ్జెట్‌లో 9శాతం నిధులు
- టీచర్లకు విదేశీ శిక్షణ.. అంతర్జాతీయ ప్రమాణాలతో బోధన
- ఓట్ల కోసం కాదు.. తరాల భవిష్యత్తు కోసమే విద్యా సంస్కరణలు
- బదిలీలు, ప్రమోషన్ల బాధ్యత నాదే
- ప్రతి మండలానికి ప్రత్యేక విద్యా ప్రణాళికలు
- ఉపాధ్యాయులతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణను విద్యారంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా అభివృద్ధి చేసి, మెరుగైన ప్రమాణాలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో ఉపాధ్యాయులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సీఎం మాట్లాడారు. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయిస్తున్నామని సీఎం వెల్లడించారు. ఎన్నికల ప్రయోజనాల కోసం కాకుండా, భవిష్యత్ తరాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని విద్యా సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు.

> 2034 వరకు నేనే తెలంగాణ ముఖ్యమంత్రిగా కొనసాగుతా. విమర్శలను పట్టించుకోకుండా ప్రజా సంక్షేమం, విద్యా సంస్కరణల అమలుపైనే ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసి తెలంగాణను విద్యా రంగంలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మా సంకల్పం.
> – ముఖ్యమంత్రి

విద్యాశాఖను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చాయని, తమ ప్రభుత్వం పిల్లల చదువులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీఎం అన్నారు. 'వేలాది మంది ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నా.. కనీస ఉద్యోగ దరఖాస్తు రాయలేని పరిస్థితి ఉండకూడదు. విద్యా ప్రమాణాలను పెంచాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తరువాయి 3లో..

## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం

### కఠిన శిక్షలతో సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

- పేపర్ లీక్ నేరాలకు 5–10 ఏళ్ల జైలు
- రూ.50 లక్షల వరకు జరిమానా
- వ్యవస్థీకృత నేరాలకు కనీసం ఏడేళ్ల శిక్ష
- రూ.10 కోట్లకు తక్కువ కాకుండా జరిమానా

2



## ఉద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం

2

- 100 రోజుల్లో రూ. 6,000 కోట్ల బకాయిల చెల్లింపులు
- తాజాగా మరో రూ. 2వేల కోట్లు విడుదల

## పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం

- దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

# పేపర్ లీక్‌లపై ఇక ఉక్కుపాదం

**న్యూఢిల్లీ:** పబ్లిక్ పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు–2026కు పార్లమెంట్ గురువారం ఆమోదం తెలిపింది. లోక్‌సభ ఇప్పటికే ఆమోదించిన ఈ బిల్లుకు రాజ్యసభ కూడా వాయిస్ ఓటుతో ఆమోదం తెలపడంతో చట్టరూపం దాల్చేందుకు మార్గం సుగమమైంది. మంత్రి సమాధానానికి ముందే ఇండియా కూటమి ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. సవరణ బిల్లు ప్రకారం పేపర్ లీక్‌లు లేదా పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారికి కనీసం ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధించనున్నారు. వ్యవస్థీకృత నేరాలకు కనీసం ఏడేళ్ల జైలు, రూ.10 కోట్లకు తగ్గకుండా జరిమానా విధించే నిబంధనను చేర్చారు. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసుకునే అధికారం పొందనున్నాయి. చార్జ్‌షీట్ దాఖలైన మూడు నెలల్లోపు విచారణ పూర్తి చేయాలని బిల్లులో స్పష్టం చేశారు. అవసరమైతే కేసుల దర్యాప్తుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసే వెసులుబాటును కూడా కల్పించారు. బిల్లుపై చర్చకు సమాధానమిచ్చిన కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్, విద్యార్థుల భవిష్యత్తును రక్షించేందుకు ప్రభుత్వం మరింత ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉందన్నారు. పరీక్షల వ్యవస్థలో సమగ్ర సంస్కరణలే లక్ష్యంగా ఈ చట్టాన్ని రూపొందించామని, ఇది కేవలం ఎన్‌టీఏ పరీక్షలకే కాకుండా యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ తదితర అన్ని కేంద్ర ప్రభుత్వ పరీక్షలకు వర్తిస్తుందని తెలిపారు. మంత్రి సమాధానానికి ముందే ప్రతిపక్షాలు వాకౌట్ చేయడాన్ని జితేంద్ర సింగ్, సభానేత జేపీ నడ్డా తీవ్రంగా తప్పుబట్టారు. బిల్లును పూర్తిగా చదవకుండానే విమర్శలు చేస్తున్నారని, పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రతిపక్షాలు గౌరవించడం లేదని ఆరోపించారు.

## ప్రతిపక్షాల ఆందోళనలు

బిల్లుపై జరిగిన చర్చలో ప్రతిపక్ష సభ్యులు విద్యార్థులపై పోలీసు చర్యలు, పేపర్ లీక్‌లకు బాధ్యులపై జవాబుదారీతనం లేకపోవడం వంటి అంశాలను ప్రస్తావించారు. అయితే విద్యార్థుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అధికార పక్ష సభ్యులు పేర్కొన్నారు.

బాక్స్

## వందేమాతరం గీతానికీ గ్రీన్ సిగ్నల్

వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్–1971 చట్టంలో మార్పుల కోసం కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్ మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది.

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం :** పేదలకు ఇంటి చింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని చండ్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్, లో – లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు.



వర్షపు నీటితో నిండిన గోదావరి ఇన్‌సెట్‌లో పెరిగిన గోదావరి నీటి మట్టం


కడెం ప్రాజెక్టు వద్ద గేట్లు ఎత్తడంతో దుంకుతున్న వరదనీరు

# ఉత్తరం అతలాకుతలం

- ముంచెత్తుతున్న ఎడతెరిపిలేని వానలు
- ఉధృతంగా గోదావరి, ప్రాణహిత
- జలాశయాలకు భారీగా పోటెత్తుతున్న వరద
- కడెం, మేడిగడ్డ, ఎస్సారెస్పీ వద్ద అప్రమత్తమైన అధికారులు
- తొమ్మిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- మరో మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక

**ప్రజానావ, హైదరాబాద్:** వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తుండగా, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు జలకళ సంతరించుకుంటున్నాయి. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ వాతావరణ కేంద్రం మరో మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరిస్తూ తొమ్మిది జిల్లాలకు ఆరెంజ్, మరో ఆరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మహారాష్ట్రతో పాటు తెలంగాణ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వరద ఉధృతి పెరిగింది. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు భారీగా వరదనీరు చేరుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయం 77,442 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవగా, ఆరు గేట్లు ఎత్తి సుమారు 67 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రవాహ ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు కూడా వరద ప్రవాహం కొనసాగుతోంది. సుమారు 12,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, జలాశయంలో నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరుకుంది. కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని స్వర్ణ ప్రాజెక్టుకు కూడా వరదనీరు భారీగా చేరుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌కు భారీగా వరద చేరుతుండటంతో అధికారులు 85 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 27 అడుగులకు చేరగా, ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

## గ్రామాలకు రాకపోకలు బంద్

భారీ వర్షాల కారణంగా ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జగిత్యాల జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించగా, జూరాల ప్రాజెక్టు గేట్లను ఈ సీజన్‌లో తొలిసారిగా ఎత్తి వరదనీటిని విడుదల చేశారు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగడంతో పర్యాటకుల ప్రవేశాన్ని అటవీశాఖ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.

## వాజేడులో 16.5 సెం.మీ. వర్షపాతం

రాష్ట్రంలో అత్యధికంగా ములుగు జిల్లా వాజేడులో 16.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, వాగులు, వంకలు, జలాశయాలు, వరద ప్రవాహ ప్రాంతాల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నీటిపారుదల, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖలు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నాయి.

## ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాల ఎత్తిపోత

### నంది పంప్‌హౌస్‌లో నాలుగు మోటార్లతో 12,600 క్యూసెక్కుల పంపింగ్

### కాళేశ్వరం లింక్–2 ద్వారా కొనసాగుతున్న నీటి తరలింపు

**ప్రజానావ, పెద్దపల్లి:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అనుబంధ లింక్–2లో భాగంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ప్రారంభమైన నీటి పంపింగ్ ప్రక్రియ గురువారం కూడా నిరంతరంగా కొనసాగింది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది పంప్‌హౌస్‌లో ప్రస్తుతం 1, 4, 5, 6 నంబర్ మోటార్లను వినియోగిస్తూ నీటిని ఎత్తిపోస్తున్నారు. ఒక్కో మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున మొత్తం నాలుగు మోటార్లతో 12,600 క్యూసెక్కుల గోదావరి జలాలను నంది రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. నంది రిజర్వాయర్ నుంచి అదే పరిమాణంలో నీటిని క్రస్ట్ గేట్ల ద్వారా ఏడో ప్యాకేజీ జంట సొరంగాల గుండా కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. అక్కడి నుంచి నాలుగు భారీ మోటార్ల సహాయంతో వరద కాలువ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి గోదావరి జలాలను విడుదల చేస్తున్నారు. నీటి తరలింపు ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేయండి

రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. నగరంలోని కంపెనీలు, సంస్థలు సాధ్యమైన చోట వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేయాలని సూచిం చారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉద్యోగులకు విడతల వారీగా ముందస్తు లాగౌట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా చూడడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రయాణ ప్రమాదాలు తగ్గించి, రహదారులపై ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. సంస్థలు తమ కార్యాలయ స్థానం, ముందస్తు లాగౌట్ సమయాలను ట్రాఫిక్ పోలీసులకు ఈ–మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని, వర్షం పడుతున్నప్పుడు జాగ్రత్తగా ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇకలేరు

(మొదటిపేజీ తరువాయి)

(మొదటిపేజీ తరువాయి)

సీపీఆర్ నిర్వహించారు. అనంతరం వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స కొనసాగించినప్పటికీ ఆయన ఆరోగ్యం మెరుగుపడలేదు. ఆక్సిజన్ లోపం కారణంగా మెదడుకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఈసీజీ, బ్రెయిన్ ఎంఆర్ఐ, టీసీడీ పరీక్షల్లో వెల్లడైందని వైద్యులు తెలిపారు. ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఆయన చివరకు కన్నుమూశారు.

## జడ్పీటీసీ స్థాయి నుంచి..

1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలంలో రైతు కుటుంబంలో జన్మించిన సుదర్శన్‌రెడ్డి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయన.. 2001లో టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరి నల్లబెల్లి జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అనంతరం రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజాప్రతినిధిగా సేవలందించారు. ఆయన మృతిపై పలువురు రాజకీయ నాయకులు, పార్టీ శ్రేణులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# కూరగాయల సాగును ప్రోత్సహించండి

- సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి
- నిపుణుల కమిటీతో సీఎం రేవంత్‌రెడ్డి
- ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ




**ప్రజానావ, హైదరాబాద్ :** రాష్ట్రంలో రగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో రగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, రగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గత ఏడాది ఈ సీజన్‌లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి? పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో రగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది.

### ఉద్యోగులకు ఇచ్చిన హామీ

# నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం

## 100 రోజుల్లో రూ.6,000 కోట్ల బకాయిల చెల్లింపులు

**ప్రజానావ, హైదరాబాద్ :** ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. గత 100 రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రూ.6,000 కోట్ల బకాయిల చెల్లింపులను పూర్తి చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. గురువారం మరో రూ.2,000 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మూడు విడతల్లో ఒక్కోసారి రూ.2,000 కోట్ల చొప్పున మొత్తం రూ.6,000 కోట్లను విడుదల చేసింది. దీంతో పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగు ల కమ్యూటేషన్ బకాయిలను పూర్తిగా చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభు త్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగులు, పెన్షన ర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ జేఏసీ నాయ కులకు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో రూ. 6,000 కోట్ల బకా యిలను విడుదల చేస్తామన్న మాటను తెలంగాణ ప్రభుత్వం నిలబెట్టుకుంది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసా గుతూ తమ చిత్తశుద్ధిని మరోసారి చాటుకుంది. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధా న్యతనిస్తోంది. విశ్రాంత ఉద్యోగులకు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం ఈ నిధులతో పూర్తిగా చెల్లించింది. రాబోయే రోజుల్లో మిగిలిన ఇతర బకాయిలను డా ఇదే రీతిలో క్రమపద్ధతిలో క్లియర్ చేస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వం ఉద్యోగుల బకాయిల నిధులు విడుదల చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది తీవ్ర హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక ప్రతికూల పరిస్థితుల్లోనూ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న సానుకూల ధోరణి అభినందనీయమని ఉద్యోగ జేఏసీ నేతలు కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం విజయవంతం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన
- కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం



**ప్రజానావ, వేములవాడ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ–కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించి ఎన్నికల హామీని నిలబెట్టుకుందని తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణంతో తెలంగాణ ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. 1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ.1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడకు రోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తుండగా, రోజుకు దాదాపు 50 వేల మంది ప్రయాణికులు ఈ బస్‌స్టేషన్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించడంతో పాటు గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించినట్లు గుర్తుచేశారు. దాదాపు రూ.100 కోట్లతో బస్‌స్టేషన్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు రూ.1,000 కోట్ల పీఎఫ్ బకాయిలు, రూ.600 కోట్ల సీసీఎస్ బకాయిలను చెల్లించినట్లు వెల్లడించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతులతో పాటు బస్‌స్టేషన్లను కూడా ఆధునీకరిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద ప్రజారవాణా సంస్థగా తెలంగాణ ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సమర్థవంతంగా అందిస్తోందని పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బస్‌స్టేషన్ ఆధునీకరణకు రూ.1.62 కోట్లు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, డాక్టర్ సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి. గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రిజర్వాయర్ల నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలి
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి




**ప్రజానావ, సిరిసిల్ల :** సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు, ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం నిర్వహించిన సూపర్ ఎల్‌నినోపై సమీక్ష సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే జిల్లా ఎల్‌నినో ప్రణాళిక, తెలంగాణ జలసిరి పేరుతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావం దక్షిణ భారతదేశంపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, వర్షపాతం తగ్గే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటిని వచ్చే ఏడాది జూలై వరకు తాగునీటి అవసరాలకే వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. గత రెండు నెలలుగా తగినంత వర్షపాతం లేకపోవడంతో పంటల సాగు గణనీయంగా తగ్గిందని పేర్కొన్న మంత్రి, వచ్చే నెలలో ఏ పంటలు సాగు చేయడం అనుకూలమో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఆరుతడి, స్వల్పకాలిక పంటలు, పప్పుధాన్యాలు, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని, అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి మార్గనిర్దేశం చేయాలని సూచించిన మంత్రి, భూగర్భ జలాల మట్టం గత ఏడాదితో పోలిస్తే రెండు మీటర్లకు పైగా పడిపోయిందని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులు, పంటల మార్పిడిపై రైతులకు ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చదువుల తెలంగాణే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

సీఎం పేర్కొన్నారు. తల్లిదండ్రు ల తర్వాత పిల్లలకు మార్గనిర్దేశం చేసేది ఉపా ధ్యాయులేనని అన్నారు. పాఠశాలల్లో విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణను కూడా బోధించాలని సూచించారు. ప్రతి మండలాన్ని ఒక విద్యా క్లస్టర్‌గా పరిగణించి ప్రత్యేక ప్రణాళికలు రూ పొందించాలని అధికారులను ఆదేశించారు. బోధనా విధానాల్లో అంతర్జాతీయ ప్రమాణాలు తీసుకొచ్చేందుకు ఏటా 10 నుంచి 12 మంది ఉపాధ్యాయులను విదేశాలకు స్టడీ లీవ్‌పై పంపిస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమో షన్ల విషయంలో తానే బాధ్యత తీసుకుంటా నని సీఎం హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా జీతాలు సకాలం లో అందిస్తున్నామని వివరించారు. విద్యార్థు ల హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచినట్లు తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలల నుంచే ఉన్నత శిఖరాలకు

ప్రభుత్వ పాఠశాలలో చదివితే ఏం అవుతావని ఎవరైనా అడిగితే.. ''తెలంగాణ ముఖ్యమంత్రి అవుతాను'' అని పిల్లలు ధైర్యంగా చెప్పే పరిస్థితి రావాలని రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ఎలాంటి మంత్రి పదవి అనుభవం లేకుండానే ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని గుర్తు చేశారు. ఇటీవల హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో అధ్యయనం చేశానని పేర్కొన్న సీఎం.. కేవలం తెలివితేటలతోనే కాకుండా క్రమశిక్షణతోనూ ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. అమెరికా, జర్మనీ, జపాన్ వంటి దేశాల విద్యా విధానాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. భాష అనేది కేవలం భావ వ్యక్తీకరణకు ఒక సాధనం మాత్రమేనని పేర్కొన్నారు.

### ఆరు నెలలకోసారి సమావేశం

ఉపాధ్యాయ సంఘాలతో ప్రతి ఆరు నెలలకోసారి సమావేశమై సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఐఏఎస్ అధికారుల బదిలీలు సులభ మైనా.. ఉపాధ్యాయ వ్యవస్థ ఎంతో శక్తివంతమైనదని కొనియాడారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల ని ఉపాధ్యాయులను కోరారు. దేశ అప్పులపై కేంద్రం పై విమర్శలు దేశ అప్పుల అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకు దేశ అప్పులు రూ.51 లక్షల కోట్లు ఉండగా, 2014 తర్వాత రూ.151 లక్షల కోట్ల మేర అప్పులు పెరిగాయని ఆరోపించారు. విద్యా రంగంలో మార్పుల కోసం కొత్త విషయాలు నేర్చుకునేందుకే హార్వర్డ్‌కు వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.



**బో**నాల పండుగను పురస్కరించుకొని సోమాజిగూడ డివిజన్‌లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌ను కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు గురువారం ఆమె వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని 12 పోచమ్మ ఆలయాల పరిసరాల్లో మట్టికుప్పలు, చెత్తాచెదారాన్ని తొలగించి, వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ భక్తులకు అసౌకర్యం కలగకుండా పండుగకు ముందే పారిశుద్ధ్య పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

– ప్రజానావ, ఖైరతాబాద్

# పాఠశాలే ప్రాణంగా.. విద్యార్థులే ప్రపంచంగా

- ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి 34ఏండ్ల ఉద్యోగ స్ఫూర్తి ప్రస్థానం
- పాఠశాలనే కుటుంబంగా భావించి సేవలందించిన ప్రధానోపాధ్యాయుడు డా. చకినాల శ్రీనివాస్





ప్రజానావ, సిరిసిల్ల: ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోవని తన సేవలతో నిరూపించిన ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ చకినాల శ్రీనివాస్ నేడు పదవీ విరమణ పొందనున్నారు. మూడున్నర దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా వేలాది మంది విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేసిన ఆయన ప్రస్థానం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఒక పాఠశాల అభివృద్ధి అంటే కేవలం భవనాలు కాదు... విద్యార్థుల భవిష్యత్తు, సమాజ విశ్వాసం, ఉపాధ్యాయుల అంకితభావం కలిసి నిర్మించే ఉద్యమమని ఆయన కార్యాచరణ చాటిచెప్పింది. 1965 జూలై 30న రాజన్న సిరిసిల్ల జిల్లా దుమాలలో హనుమయ్య, నర్సమ్మ దంపతులకు జన్మించిన శ్రీనివాస్ ప్రాథమిక విద్యను స్వగ్రామంలో, ఉన్నత విద్యను సిరిసిల్ల, హైదరాబాద్‌లలో పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీతో పాటు ఎంఎస్సీ (గణితం), ఎంఎస్సీ (భూగోళశాస్త్రం), ఎంకాం, ఎంఎడ్ వంటి ఉన్నత విద్యార్హతలు సాధించి విద్యారంగంలో అరుదైన గుర్తింపు పొందారు. 1992 నవంబర్ 17న ఆదిలాబాద్ జిల్లా బోథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన, సిరిసిల్ల, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో సేవలందించి 2018లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిరిసిల్ల ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు.

### 86 నుంచి 322 మంది విద్యార్థుల వరకు..

2018 జూలై 7న ఆయన సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడుగా బాధ్యతలు చేపట్టే సమయానికి పాఠశాలలో కేవలం 86 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా, తరగతులకు హాజరైన వారు 31 మందే. అయితే ఇంటింటి ప్రచారం, బడిబాట, తల్లిదండ్రులతో సమావేశాలు, స్వయం సహాయక సంఘాలతో చర్చలు, నాణ్యమైన బోధన, సౌకర్యాల కల్పన వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా పాఠశాలపై ప్రజల్లో విశ్వాసం పెంచి విద్యార్థుల సంఖ్యను 322కు చేర్చడం విశేషం.

### దాతల సహకారంతో ఆదర్శ పాఠశాలగా..

పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 20 కంప్యూటర్లతో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, ప్రతి తరగతి గదికి డిజిటల్ ప్రొజెక్టర్లు, 11 సీసీ కెమెరాలు, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, ఆర్వో ప్లాంట్, ఫర్నిచర్, ఇనుప బీరువాలు, మరుగుదొడ్లు, హ్యాండ్‌వాష్ యూనిట్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థికి పలు సంవత్సరాలుగా ఉచితంగా నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, షూస్, భోజన ప్లేట్లు, టీషర్టులు అందించారు. గత ఏడాది 300 స్కూల్ బ్యాగులు, 20 సైకిళ్లు బాలికలకు అందించడం విశేషం.

### ఫలితాల్లోనూ ప్రతిభ..

ఆయన హయాంలో పలుమార్లు పదో తరగతి ఫలితాల్లో సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎన్ఎంఎంఎస్ ఎంపికలు, ఇన్‌స్పైర్ సైన్స్ అవార్డులు, యోగా జాతీయ స్థాయి ఎంపికలు, రాష్ట్రస్థాయి సైన్స్ ప్రాజెక్టులు, క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు అనేక విజయాలు సాధించారు.

### పుస్తక రచయిత.. పాఠ్యపుస్తకాల రూపకర్త

ఉపాధ్యాయుడిగానే కాకుండా రచయితగా కూడా డాక్టర్ శ్రీనివాస్ విశేష కృషి చేశారు. తెలంగాణ జల వనరులు, తెలంగాణ భౌగోళిక విజ్ఞాన సర్వస్వం, రాజన్న సిరిసిల్ల జిల్లా సమగ్ర స్వరూపం వంటి గ్రంథాల రచనలో భాగస్వాములయ్యారు. తెలంగాణ ప్రభుత్వ 6, 7, 8వ తరగతి సామాజిక శాస్త్ర పాఠ్య పుస్తకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ఇంటర్మీడియట్ భూగోళశాస్త్ర సబ్జెక్టు కమిటీ సభ్యుడిగా కూడా సేవలందించారు.

### సెలవుల కంటే సేవకే ప్రాధాన్యం

34 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో సాధారణ సెలవులను కూడా అత్యంత అవసరమైన సందర్భాల్లో మాత్రమే వినియోగించారు. ముఖ్యంగా 2023 జనవరి 28 నుంచి 2025 ఆగస్టు 19 వరకు దాదాపు రెండేళ్ల ఏడు నెలల పాటు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా విద్యార్థుల కోసం సేవలందించడం ఆయన విధి నిబద్ధతకు నిదర్శనం.

### ఆవిష్కరణలకు చిరునామా

వేసవి శిబిరాలు, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్, సైన్స్ ఎగ్జిబిషన్లు, ఆరోగ్య శిబిరాలు, బయోడైవర్సిటీ కార్యక్రమాలు, పిచ్చుకల గూళ్ల తయారీ, మట్టి గణపతులు, కంపోస్ట్ తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, ఎనర్జీ క్లబ్, కిచెన్ గార్డెన్, హరితహారం, డిజిటల్ కంటెంట్ వినియోగం, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, విహారయాత్రలు, పూర్వ విద్యార్థుల సన్మానాలు... ఇలా పాఠశాలను ఒక సజీవ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దారు.

### పురస్కారాలు

2022లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ వ్యాసరచన పోటీలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి, 2025లో జిల్లా కలెక్టర్ ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా సత్కరించారు. విద్యారంగంతో పాటు జలసాధన వేదిక, తెలంగాణ విద్యావంతుల వేదిక, సాగునీటి ఉద్యమం, ఉపాధ్యాయ సంఘాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకైన పాత్ర పోషిస్తూ సమాజానికి తనవంతు సేవ అందించారు. పదవీ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమేనని, సేవకు కాదని తన జీవితంతో నిరూపించిన డాక్టర్ చకినాల శ్రీనివాస్... విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే గురువు, ఆదర్శ ప్రధానోపాధ్యాయుడిగా గుర్తుండిపోతారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రెడ్ అలర్ట్ నేపథ్యంలో వచ్చే 24 గంటలు అత్యంత కీలకం
- ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి
- చెరువులు, గోదావరి పరీవాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలి
- ముంపునకు గురైన కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని వసతులు కల్పించాలి
- జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు






ప్రజానావ, పెద్దపల్లి : గత 48 గంటలుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ నేపథ్యంలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ లతో కలిసి భారీ వర్షాల పరిస్థితిపై జిల్లా అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ జిల్లాలోని ఒక్క చెరువు కూడా గండి పడకుండా లేదా తెగిపోకుండా సాగునీటి శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా సాగునీటి శాఖ అధికారి ఆధ్వర్యంలో లస్కర్లు, సహాయ ఇంజినీర్లు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పూర్తి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) చెరువులను పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలతో కలిసి నిరంతరం పరిశీలించాలని సూచించారు. చెరువుల్లో గండ్లు, నీటి పొంగిపొర్లడం లేదా ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీట మునిగిన కాజ్‌వేలు, లోతట్టు రహదారులను వెంటనే రాకపోకలకు మూసివేయాలని, అలాంటి ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు, పోలీసు సిబ్బందిని మోహరించి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వర్షాల వల్ల దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లను వెంటనే గుర్తించి అత్యవసర మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, పశువుల నష్టం వంటి ఘటనలను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిహార ప్రతిపాదనలు సిద్ధం చేసి ట్రెజరీకి పంపించి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ కొనసాగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లు తదితర స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. నీట మునిగిన ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి, అక్కడ ఆహారం, తాగునీరు, వసతి, తదితర అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లను వెంటనే గుర్తించి వాటిలో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) అధికారులు విద్యుత్ సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించి, దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థలను అత్యవసరంగా పునరుద్ధరించాలని మంత్రి ఆదేశించారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాలు, సరిహద్దు మండలాలు, గ్రామాల్లో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని, చేపల వేట, పశువులను మేపడం లేదా ఇతర ప్రమాదకర కార్యకలాపాల కోసం ఎవరూ నదిలోకి వెళ్లకుండా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న లేదా రాకపోకలకు అంతరాయం కలిగిన రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఏవైనా అత్యవసర సంఘటనలు జరిగిన వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై పవిత్ర

ప్రజానావ,పెద్దపల్లి : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై పవిత్ర గత కొన్ని రోజుల నుండి వర్షాలు నిరంతరం కురవడం వలన ప్రజలకు అంటువ్యాధులు సంభవించే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వార ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన చేసుకొని అంటువ్యాధులకు గురికాకుండా ఉండాలని కోరారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలని ఈగలు దోమల నివారించాలని తెలియజేశారు. ఈగల వలన కలరా టైఫాయిడ్ రక్త విరోచనాలు నీళ్ల విరోచనాలు టైఫాయిడ్ సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. దోమల వలన మలేరియా ఫైలేరియా డెంగ్యూ చికెన్ గునియా మెదడువాపు వ్యాధులు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి వాటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా రక్త పరీక్షలు చేయించుకొని తగిన చికిత్సలు తీసుకోవాలని కోరారు. ప్రజలు వేడి చేసి చల్లార్చిన నీటిని వేడి ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలని కోరారు. వర్షాల వలన పిల్లలు వృద్ధులు ఎవరు కూడా అనవసరంగా ప్రయాణాలు చేయకుండా ఉండాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సహాయంతో ముందుగానే ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి ప్రభుత్వ వైద్యుల ద్వారా సాధారణ ప్రసవాలు జరిగేటట్లు చూసుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ అందించే సేవలపై అవగా హన పెంచుకొని ఆరోగ్యవంతంగా జీవించాలని తెలిపారు. ఈ వర్షాలు మరికొన్ని రోజులు వచ్చే అవకాశం ఉన్నందువలన ప్రయాణాలకు అంతరాయం కలిగి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి అనవసరమైన ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని తెలిపారు.

# ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రాధాన్యం

### పాత బజారలో పరిస్థితులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

ప్రజానావ, రామగుండం : రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రామగుండం నియోజకవర్గంలోని పాత బజారు ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి, వర్షాల ప్రభావంపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సూచించారు. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రభావిత ప్రాంతాల్లో సంచరించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వర్ష పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పర్యటనలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# సిరిసిల్ల పెద్ద బజార్‌లో నేల కూలిన భారీ వృక్షం

- కారు, గూడ్స్ వాహనం ధ్వంసం
- తెగిపడిన విద్యుత్ వైర్లు
- తప్పిన భారీ ప్రమాదం
- ఒకరికి గాయాలు..

### ఆసుపత్రికి తరలింపు

ప్రజానావ, సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సిరిసిల్ల పట్టణంలోని పెద్ద బజార్ లో భారీ వృక్షం ఒక్కసారిగా రోడ్డుపై కూలిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పెద్ద బజారులోని హనుమాన్ దేవాలయ సమీపంలో జరిగిన ఈ ఘటనలో భారీ వేప చెట్టుతో పాటు హైటెన్షన్ విద్యుత్ వైర్లు కూడా తెగిపడి రోడ్డుపై పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో రోడ్డుపై నుంచి వెళ్తున్న కారు, గూడ్స్ వాహనం ధ్వంసమయ్యాయి. కారు నడుపుతున్న వ్యక్తి గాయపడగా వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ, మున్సిపల్ సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తెగిపడిన విద్యుత్ వైర్ల కారణంగా ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి, చెట్టును తొలగించే పనులు కొనసాగిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఇంజినీరింగ్ విద్యార్థులను అవమానించడం దుర్మార్గం

- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్



ప్రజానావ, సిద్ధిపేట: రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు, ఎన్నికల హామీల అమలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సిద్ధిపేటలో జరిగిన సీపీఎస్ ఉద్యోగుల జనచైతన్య యాత్ర రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ శాసనసభాపక్ష డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై సంఘీభావం తెలిపారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ విస్మరించిందని ఆరోపించారు. సీపీఎస్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు దేవరాజు వినతిపత్రం అందజేయడానికి తన క్యాంపు కార్యాలయానికి వస్తామని చెప్పగా, మీరు ఎందుకు రావాలి.. మీ న్యాయమైన పోరాటానికి మద్దతుగా నేనే వస్తాను అని చెప్పినట్లుగానే తాను వచ్చానని హరీశ్ రావు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, జిల్లా అధ్యక్షుడు దేవరాజు, ప్రధాన కార్యదర్శులు శశికుమార్, రఘురామ, ఉదయశ్రీతో పాటు ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులను అభినందించారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ఉద్యోగులు అడుగుతున్నది అన్యాయమైన కోరిక కాదని పేర్కొన్న హరీశ్‌రావు, అధికారంలోకి వస్తే ఓపీఎస్ అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి 32 నెలలు గడిచినా ఆ హామీ అమలుకు నోచుకోలేదని, పీఆర్సీ, పెండింగ్ డీఏలు, మెరుగైన ఈహెచ్ఎస్, ఇతర హామీలు కూడా అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ఇప్పుడు చిత్తుకాగితంగా మారిపోయిందని, ఉద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఉద్యోగులతో విభేదించిన ప్రభుత్వాలు చరిత్రలో నిలవలేదని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని, వారిని నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలకు ప్రజలే గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఓపీఎస్, పెండింగ్ డీఏలు, పీఆర్సీ, ఈహెచ్ఎస్ వంటి సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తామని, అవసరమైతే అసెంబ్లీని స్తంభింపజేసైనా ఉద్యోగుల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాడుతుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ఉద్యోగులపై విజిలెన్స్, ఏసీబీ, సీఐడీ విచారణల పేరుతో ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించిన హరీశ్‌రావు, అలాంటి చర్యలకు ఉద్యోగులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ నిధులను కూడా ఎనిమిది నెలల పాటు ప్రభుత్వం జమ చేయలేదని, బీఆర్ఎస్ అసెంబ్లీలో ప్రశ్నించిన తర్వాతే చెల్లింపులు ప్రారంభించిందని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకానికి కూడా తగిన నిధులు కేటాయించలేదని, ఎంఈఓ, డీఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయలేదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రిగా కొనసాగేందుకు రేవంత్‌రెడ్డికి నైతిక హక్కు లేదని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఉద్యమానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. పోరాడితే పోయేది బానిస సంకెళ్లు తప్ప మరేమీ కాదు అంటూ ఉద్యోగులకు పిలుపునిస్తూ, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు, పెండింగ్ డీఏలు, పీఆర్సీ, ఈహెచ్ఎస్ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఉద్యమానికి పార్టీ అండగా నిలుస్తుందని ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, నాయకులు, సీపీఎస్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం!

అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండ డం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించ డంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమై న ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచు కోవడంలో డా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు.

ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండ డం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించ డంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమై న ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచు కోవడంలో డా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్ల మెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్ల మెంట్ సమావేశాల్లో డా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ది పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యా ర్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తు న్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగా రు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది డా తెలియని వారు మన పాలనా వ్యవస్థలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ డా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతు న్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకు ని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదిదా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది వలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశు ద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పం దన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందు కు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్ లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వ హించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగిం ది. అందు అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూ తి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా వలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. వలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివ చ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాని కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం. నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీ ఛార్జ్ షరామమాలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావిం చాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.

నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీ ఛార్జ్ షరామమాలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి.

EDITORIAL

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అన్నపురెడ్డిపల్లి మండలంలో రూ.2.77 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు
- ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు




**ప్రజానావ, ఖమ్మం:** రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి రూ.2.77 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. పర్యటనలో భాగంగా గుంపెన గ్రామంలో రూ.45 లక్షల వ్యయంతో తొమ్మిది అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, నరసాపురంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1.17 కోట్లకు పైగా వ్యయంతో సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. భీమునిగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించగా, కోండాయిగూడెం 2బీహెచ్‌కే కాలనీ పరిధిలో రూ.20 లక్షలు, పెద్దిరెడ్డిగూడెం ఎర్రగుంటలో రూ.75.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పెద్దిరెడ్డిగూడెం, గుంపెన, భీమునిగూడెం, నరసాపురం, ఊటుపల్లి, రంగాపురం గ్రామాలకు చెందిన అగ్గి రాజమ్మ, మాయారా వసంత, వాడే సుజాత, తిరుమలదేవి అనిత, చీపుడు జ్యోతి, మొల్లచ వుకు కవిత, వేముల కృష్ణయ్య, పెనుగొండ కోటమ్మల నూతన గృహప్రవేశాల్లో పాల్గొని వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిర మ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో పూరిగుడిసెలు లేని తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని, మహిళల సాధికారత, రైతుల సంక్షేమం, గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి వారం రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకల వద్ద అధికా రులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, హౌసింగ్ పీడీ, జిల్లా పంచాయతీ అధికారిణి అనూష, స్థానిక తహసీల్దార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కేసీఆర్‌ను కలిసిన గోలి సంతోష్

- ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో భేటీ
- ఎడ్లబండి జ్ఞాపిక అందజేత

**ప్రజానావ, మర్కుక్:** సిద్దిపేట జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు, గజ్వేల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోలి సంతోష్, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో తెలంగాణ తొలి ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా రూపొందించిన ఎడ్లబండి జ్ఞాపికను కేసీఆర్‌కు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్రంలోని వ్యవసాయ పరిస్థితులు, గజ్వేల్ నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎరువులు, విత్తనాల లభ్యత తదితర అంశాలపై నాయకులు కేసీఆర్‌కు వివరించారు. రైతాంగ సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని కేసీఆర్ సూచించారు. తమపై చూపిన ఆప్యాయతకు, వ్యవసాయ రంగంపై అందించిన విలువైన సూచనలకు కేసీఆర్‌కు గోలి సంతోష్, వంటేరు ప్రతాప్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం

- బాధ్యత విస్మరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- ప్రతి 45 రోజులకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహణకు ఆదేశం
- రైతులు, విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లపై అధికారులకు కీలక సూచనలు




**ప్రజానావ, వనపర్తి:** ప్రజలే ప్రభుత్వానికి యజమానులని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు, పార్టీలు, వ్యక్తిగత అభిప్రాయాలకు ఎలాంటి స్థానం లేదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే అధికారుల ప్రధాన బాధ్యత అని, ఆ బాధ్యతను విస్మరించే అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించారు. వనపర్తి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివిధ శాఖల పనితీరును సమీక్షించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు యూరియా కొరత తలెత్తకుండా ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పశువైద్య వ్యాక్సిన్లు, గడ్డి విత్తనాలు రైతులకు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం చేపట్టడంతో పాటు మధ్యాహ్న భోజనంలో నాణ్యతను కాపాడాలని, అవసరమైన చోట డైనింగ్ హాళ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మట్టి, ఇసుక తరలింపులో ఎలాంటి అడ్డంకులు సృష్టించకుండా లబ్ధిదారులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి గ్రామంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, కొత్త గ్రామపంచాయతీలు, తండాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వనపర్తి జిల్లా ఆసుపత్రిలో రూ.1.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్‌తో పాటు 12 రకాల వైద్య పరీక్షలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొంటూ సమర్థవంతంగా పనిచేస్తున్న వైద్యాధికా రులను ఎమ్మెల్యే అభినందించారు. ఇకపై ప్రతి 45 రోజులకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాలని, సమావేశానికి సంబంధించిన పూర్తి అజెండాను 15 రోజుల ముందుగానే సభ్యులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ధర్మమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా అధికారులు పనిచేస్తే ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల రక్షణకు రైతులు భాగస్వాములు కావాలి

- దొంగతనాల నివారణకు రైతు కమిటీలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి
- పోలీస్ పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేస్తాం
- హుజూర్‌నగర్‌లో అవగాహన సదస్సులో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి



**ప్రజానావ, సూర్యాపేట:** లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల భద్రతలో రైతులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, విద్యుత్ వైర్లు, ఆయిల్ దొంగతనాలను సమర్థంగా అరికట్టవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల రైతులు, నీటిపారుదల, విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్, జిల్లా ఎస్పీ నరసింహ, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలలో దొంగతనాలు జరిగితే చివరకు నష్టపోయేది రైతులేనని పేర్కొన్నారు. దొంగతనాలు జరిగిన తర్వాత నిందితులను పట్టుకుని సొత్తును రికవరీ చేయడం కంటే ముందుగానే వాటిని అడ్డుకోవడమే ఈ అవగాహన సదస్సు ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ప్రతి లిఫ్ట్ ఇరిగేషన్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు రైతులు సహకార సంఘాలు, కమిటీలుగా ఏర్పడి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతు కమిటీల ఏర్పాటుకు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగిస్తూ తక్కువ నీటితో పండే పంటలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ రైతుల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న లిఫ్ట్ పథకాలనే లక్ష్యంగా చేసుకుని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, ఆయిల్‌ను అపహరిస్తున్నారని చెప్పారు. రైతుల ఐక్యత, సామాజిక బాధ్యత పెరిగినప్పుడే ఇలాంటి ఘటనలను సమర్థంగా నివారించవచ్చని పేర్కొన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ కేంద్రాల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసి, పోలీస్ పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తామని హామీ ఇచ్చారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను రైతులు తమ సొంత ఆస్తిగా భావించి సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. దొంగతనాల కారణంగా సాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడి రైతులే నష్టపోతారని పేర్కొన్నారు. వ్యవసాయానికి నిరంతర సాగునీరు అందించేందుకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నా రని తెలిపారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా అన్ని శాఖలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అవగాహన సదస్సు నిర్వహించిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని, జిల్లా ఎస్పీని ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ నాగభూషణం, విద్యుత్ శాఖ డీఈ రామ్మోహన్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ కవిత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** మండల కేంద్రానికి చెందిన బొల్లె చిన్న లక్ష్మయ్య, కమ్మరి రాఘవచారి, పిల్లెల్ల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వీరి ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో, ఈ విషయాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పందెం సుఖేందర్ రెడ్డి.. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబాల పరిస్థితిపై స్పందించిన ఎమ్మెల్యే, మేఘన్న అభయహస్తం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. 5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరశురామ్ యాదవ్, ఉప సర్పంచ్ శేషిరెడ్డి, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు జానకిరామ్ యాదవ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ యాదవ్, నాయకులు కడారి శివ, మల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, కృష్ణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మద్దతిచ్చి మోసపోయాం!



**ప్రజానావ, జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 8వ వార్డు కౌన్సిలర్ సోని ఎర్మియా భర్త ఎర్మియా తనను తాను చెప్పుతో కొట్టుకుంటూ వినూత్న నిరసన చేపట్టడం చర్చనీయాంశమైంది. తమ వార్డులో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని, ప్రజల సమస్యలను మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఆయన నిరసన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపించాలని కోరుతూ చివరి ప్రయత్నంగా తనను తాను చెప్పుతో కొట్టుకుని నిరసన తెలుపుతున్నానని ఎర్మియా పేర్కొన్నారు. వెంటనే తమ వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ప్రజలను వెంటబెట్టుకుని మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఘటనతో మున్సిపల్ కార్యాలయం వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# జలకళతో కళకళలాడుతున్న తాలిపేరు

- ఎగువ ప్రాంతాల భారీ వర్షాలతో పోటెత్తిన వరద
- 15 గేట్ల ద్వారా గోదావరిలోకి 29,174 క్యూసెక్కుల నీటి విడుదల
- ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు తరలివస్తున్న పర్యాటకులు



**ప్రజానావ, చర్ల:** ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. వరద ప్రవాహంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుని ఆహ్లాదకరంగా మారడంతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. గురువారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులోకి 37,026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు నీటిపారుదల శాఖ డీఈ తిరుపతి తెలిపారు. పెరుగుతున్న వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టులోని 12 గేట్లను రెండు అడుగుల మేర, మరో మూడు గేట్లను పూర్తిగా ఎత్తి మొత్తం 29,174 క్యూసెక్కుల నీటిని దిగువనున్న గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. తాలిపేరు ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 74 మీటర్లకు గాను ప్రస్తుతం 72.26 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రధాన జలాధారగా ఉన్న తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో జలాశయం సుందర దృశ్యాలను తిలకించేందుకు ప్రజలు, పర్యాటకులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మరోవైపు దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గోదావరి పరివాహక ప్రాంతాల్లో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులు సూచించారు.



# సింగరేణి కార్మికులకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి

- వర్షాలతో క్వార్టర్లు మునిగిపోతున్నాయి
- కార్మిక కుటుంబాల ఆందోళన
- తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని యాజమాన్యానికి విజ్ఞప్తి

**ప్రజానావ, రామగుండం:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సింగరేణి కార్మికుల నివాస క్వార్టర్లలో తీవ్ర ఇబ్బందులు నెలకొన్న నేపథ్యంలో, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేయాలని కార్మిక కుటుంబాలు సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో ఫిర్యాదులు స్వీకరించే హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటే అత్యవసర పరిస్థితుల్లో కార్మికులకు తక్షణ సహాయం అందుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ఆర్జీ–1 ఏరియాలోని జీఎం కాలనీలో పలు క్వార్టర్లలో వర్షపు నీరు నిలిచిపోయింది. ముఖ్యంగా టి–2–153, టి–2–154 క్వార్టర్లతో పాటు మరికొన్ని నివాసాల్లో నీరు బయటకు వెళ్లే మార్గాలు లేకపోవడంతో ఇళ్లలోకి చేరి కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వర్షపు నీటిని వెంటనే తొలగించి, క్వార్టర్లలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని కార్మికులు కోరుతున్నారు. అలాగే వర్షాకాల అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసి, ఫిర్యాదులపై వెంటనే స్పందించే విధంగా చర్యలు చేపట్టాలని సింగరేణి యాజమాన్యాన్ని కార్మిక కుటుంబాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

# రవీందర్‌రెడ్డికి ఘన సన్మానం

- పదవీ విరమణ సందర్భంగా ఆత్మీయుల అభినందనలు
- 37ఏళ్ల విశిష్ట సేవలకు ప్రశంసలు
- ఉద్యోగుల సంక్షేమానికి విశేష కృషిచేసిన అధికారి అంటూ కొనియాడిన జీఎం




**ప్రజానావ, రామగుండం:** సింగరేణి ఆర్జీ–1 ఏరియా పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆయనకు అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు, ఆత్మీయులు ఘనంగా సన్మానం నిర్వహించారు. బంగ్లాస్ ఏరియాలోని ఇల్లంద్ క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్జీ–1 జనరల్ మేనేజర్ డీ. లలిత్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని రవీందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, 37 ఏళ్ల సుదీర్ఘ సేవా కాలంలో రవీందర్‌రెడ్డి ఉద్యోగుల సంక్షేమం, కార్మిక సమస్యల పరిష్కారం, మానవ వనరుల విధానాల సమర్థ అమలులో విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రతి ఉద్యోగి సమస్యను తన సొంత సమస్యగా భావించి పరిష్కరించే నిబద్ధత ఆయనలో కనిపించేదని, కార్మికులు–యాజమాన్యం మధ్య సమన్వయం సాధించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆయన అందించిన సేవలు సింగరేణికి ఆదర్శప్రాయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, శాఖాధిపతులు, యూనియన్ నాయకులు మాట్లాడుతూ రవీందర్‌రెడ్డి ఎల్లప్పుడూ చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరించే వ్యక్తిత్వం కలిగిన అధికారి అని గుర్తు చేసుకున్నారు. కార్మికులు, అధికారులు మధ్య వారధిగా వ్యవహరిస్తూ పరస్పర అవగాహన పెంపొందించడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రశంసించారు. సన్మానానికి స్పందించిన ముప్పిడి రవీందర్‌రెడ్డి తన ఉద్యోగ జీవితంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి సంస్థ తనకు వృత్తిపరంగా ఎంతో గుర్తింపు, అవకాశాలు కల్పించిందని, ఆ సంస్థ పట్ల జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు, శాఖాధిపతులు, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని రవీందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# బాధితులకు అండగా ఉంటాం

**వీర్లపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**ప్రజానావ, గోదావరిఖని :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆర్.ఎఫ్.సి.ఎల్. ప్రహరి గోడ కూలిపోవడంతో వరద నీరు వీర్లపల్లి గ్రామంలోని పలు ఇండ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గురువారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌లతో కలిసి వీర్లపల్లి గ్రామంలో పర్యటించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అధికారులను అప్రమత్తం చేస్తూ, బాధితులకు అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం బాధిత ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# కడెం ప్రాజెక్టుకు భారీ వరద

- 16 గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటి విడుదల
- ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల

**ప్రజానావ, ఖానాపూర్:** నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద ప్రవాహం చేరడంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టులోని 18 గేట్లలో 16 గేట్లను ఎత్తి గోదావరి నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు కాగా, నీటిమట్టం 691.3485 అడుగులకు చేరింది. మొత్తం 3.495 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం 1.883 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి 1,29,982 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 1,49,852 క్యూసెక్కుల నీటిని అవుట్‌ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది పరివాహక ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. భారీ వరద నేపథ్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల వేర్వేరుగా కడెం ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అధికారులతో వరద పరిస్థితిపై సమీక్ష నిర్వహించిన వారు అన్ని శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్లక్ష్యానికి తావులేకుండా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే, జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి

- కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా ప్రకటించాలి
- ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద బీఆర్ఎస్ నాయకుల ధర్నా
- తెలంగాణ హక్కులను కేంద్రం వెంటనే అమలు చేయాలని డిమాండ్




**ప్రజానావ, హనుమకొండ:** కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత కల్పించడంతో పాటు కాజీపేట జంక్షన్‌ను ప్రత్యేక రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పార్టీ సీనియర్ నాయకులు నార్లగిరి రమేష్, పులి రజినీకాంత్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, సంకు నర్సింగరావు, బొంగు అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాలని, అందులో 80 శాతం ఉద్యోగాలను స్థానికులకు కేటాయించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కాజీపేట కేంద్రంగా రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేసి, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే అధికారిక ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కాజీపేట నుంచి క్రూ లింకులను ఇతర ప్రాంతాలకు తరలించవద్దని, బోడగుట్ట సమీపంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, వరంగల్–కాజీపేట కేంద్రంగా సెంట్రలైజ్డ్ క్రూ లాబీ ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక ఐటీఐ విద్యార్థులకు అప్రెంటిస్ అవకాశాలు కల్పించడంతో పాటు చిరు వ్యాపారుల కోసం వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని, కాజీపేట రైల్వే స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే స్టేషన్ల ఎదుట ఉన్న ఆటో అడ్డాల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేయవద్దని, ఫాతిమా బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా రైల్వే శాఖ సహకరించాలని కోరారు. కాజీపేట కేంద్రంగా కొత్త రైలు సర్వీసులు ప్రారంభించడంతో పాటు తెలంగాణకు రైల్వే బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందని, పునర్విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. తెలంగాణ హక్కుల కోసం పోరాడాల్సిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులను సాధించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. తెలంగాణ హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోలపెల్లి రామ్మూర్తి, అఫ్జల్, గబ్బేట శ్రీను, నరసింహారావు, దువ్వ కనకరాజు, కొండరాజు, పులి విక్రమ్, బరిగెల వినయ్, పున్నం చందర్, తండమళ్ల వేణు, చుంచు అశోక్, నరేష్, సాధినేని సుధాకర్, దశరథం, రాబర్ట్, వంశీ, గణేష్, చందు, హుస్సేన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**పెద్ది సుదర్శన్‌రెడ్డిని పరామర్శించిన వినయ్ భాస్కర్**

అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు అందుతున్న వైద్య చికిత్సపై వైద్యులను అడిగి తెలుసుకుని, అనంతరం కుటుంబ సభ్యులను కలుసుకుని ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యుడైన పెద్ది సుదర్శన్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఆయన, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, పార్టీ నాయకత్వం, కార్యకర్తలంతా ఆయన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, వైద్యుల చికిత్సతో పాటు భగవంతుని ఆశీస్సులతో ఆయన త్వరగా కోలుకుని ప్రజాసేవలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

- ఆపదలో చిక్కుకుంటే వెంటనే డయల్ - 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




**ప్రజానావ, రామగుండం:** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలోని పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆపదలో చిక్కుకున్నా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా డయల్–100కు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. అధికారులు జారీ చేసే హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని కమిషనరేట్ పరిధిలోని డ్యామ్‌లు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఎవరూ ఆ ప్రాంతాలకు వెళ్లరాదని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లరాదని సూచించారు. అలాగే చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు లేదా పాడైన నిర్మాణాల వద్ద ఆశ్రయం పొందరాదని, విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తాకరాదని హెచ్చరించారు. చెరువులు, నాలాలు, డ్యామ్‌లు, జలపాతాల వద్దకు వెళ్లకుండా ఉండాలని, చేపల వేట కోసం కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లరాదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలని సూచించారు. వరదల కారణంగా దెబ్బతిన్న లేదా నీటమునిగిన రహదారుల వద్ద ప్రజలు వెళ్లకుండా రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్అండ్‌బీ, వైద్య శాఖలతో సమన్వయం చేసుకుని బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో చెరువులు, కుంటలు, అలుగులు, ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వరద నీటి కారణంగా చెరువులు, కుంటల కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని, వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, గుంతల్లో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా కల్వర్టులు, చిన్న వంతెనలపై నీరు ప్రవహిస్తున్న సమయంలో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు, కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక శిక్షణ పొందిన 30 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. అవసరమైన సమయంలో వెంటనే డయల్–100కు సమాచారం అందించాలని, పోలీసు శాఖ 24 గంటల పాటు సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటుందని ఆయన వెల్లడించారు.

# వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలో ఎడతెరిపి లేకుం డా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికా రులతో సమీక్ష నిర్వహించిన ఆమె, శిథిలావస్థలో ఉన్న భవనాలు, లో లెవెల్ కల్వర్టులు, వాగులు, వంతెనలు, రహదారులను నిరంతరం పర్యవేక్షించా లని సూచించారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ఆస్తి, ప్రాణ లేదా పంట నష్టం సంభవిస్తే వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలని ఆదేశించారు. వర్షాలకు సంబంధించి న ఫిర్యాదు లు, అత్యవసర సమాచారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, ప్రజలు 9398684240 నంబర్‌ను సంప్రదించాల ని కలెక్టర్ తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జెడ్పీ సీఈవో వెంకట మాధవ రావు, సీపీఓ శ్రీనివాస చారి, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, డీపీఓ జయశీల, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, పంచాయితీ రాజ్ ఈఈ సుదర్శన్, తదితరులు ఉన్నారు.

# నీటి గుంతలో పడి రెండేళ్ల చిన్నారి మృతి

- ఆడుకుంటూ వెళ్లి ప్రమాదానికి గురైన చిన్నారి
- ఎర్రపాడు గ్రామంలో విషాదం



**ప్రజానావ, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం ఎర్రపాడు గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఇంటి సమీపంలోని వర్షపు నీటితో నిండిన గుంతలో ప్రమాదవశాత్తు పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన అరవింద్, సంధ్య దంపతుల కుమార్తె నవ్యశ్రీ (2) గురువారం ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా సమీపంలోని ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం తవ్విన పిల్లర్ల గుంత వద్దకు వెళ్లింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆ గుంతలో నీరు నిల్వ ఉండటంతో చిన్నారి ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా నీటి గుంతలో ఉండటాన్ని గుర్తించి వెంటనే బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో నవ్యశ్రీ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొనగా, గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# పెద్దపల్లి ప్రజల చిరకాల కల సాకారం దిశగా బస్సు డిపో

- దసరా నాటికి నిర్మాణ పనులు పూర్తి - రవాణా సౌకర్యాలు మరింత మెరుగుదల
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు



**ప్రజానావ, పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా ప్రజల ఎన్నో ఏళ్ల చిరకాల ఆకాంక్ష అయిన ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, దసరా నాటికి డిపోను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. గురువారం తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డితో కలిసి పెద్దపల్లిలో నిర్మాణంలో ఉన్న నూతన బస్సు డిపో పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ నాగిరెడ్డి అధికారులతో పాటు కాంట్రాక్టర్‌కు నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి దసరా నాటికి పూర్తి చేయాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల చిరకాల డిమాండ్ అయిన బస్సు డిపోను ఏర్పాటు చేయడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతగా తీసుకుందని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లకు బస్సు డిపోలు ఉన్నప్పటికీ, తొలి నుంచే రెవెన్యూ డివిజన్‌గా ఉన్న పెద్దపల్లికి గత ప్రభుత్వ హయాంలో డిపో ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పెద్దపల్లి ప్రజల ఆకాంక్ష అయిన బస్సు డిపో మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించిన ముఖ్యమంత్రి 2024 డిసెంబర్‌లో పెద్దపల్లి యువ వికాసం బహిరంగ సభలో బస్సు డిపోను అధికారికంగా మంజూరు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం నిర్మాణ పనులు ప్రణాళిక ప్రకారం కొనసాగుతున్నాయని, దసరా నాటికి బస్సు డిపోను ప్రారంభించి ప్రజలకు అంకితం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు. నూతన బస్సు డిపో అందుబాటులోకి రావడంతో పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు బస్సు సర్వీసులు పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన, వేగవంతమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

# వేములవాడలో వరుణయాగం

**పాల్గొన్న మంత్రులు పొన్నం, అడ్లూరి, తుమ్మల**



**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ మూడు రోజుల వరుణయాగం గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, డా. సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణ జపాలు, హోమాలు, సంతత ధారాభిషేకం నిర్వహించారు. ఆగస్టు 1 వరకు ప్రత్యేక పూజలు, హవనాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, వరుణయాగం లోకకళ్యాణం, రైతుల సంక్షే మం, సకాల వర్షాల కోసం నిర్వహించే మహో న్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సస్యశ్యామలంగా మారాలని ఆకాంక్షించారు.

**అభివృద్ధి-ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో గురువారం మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పలు అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్ర మాల్లో పాల్గొన్నారు. రూ.12 కోట్లతో అభివృద్ధి చేసిన గుడి చెరువు బండ్ పార్కును ప్రారం భించి పరిశీలించారు. అనంతరం రూ.1.62 కోట్లతో తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేసి, వేములవాడ–కోరుట్ల–బాసర ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారం భించారు. మంత్రులు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించి, జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు జరిగే వరుణయాగాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు రూ.249.40 కోట్లతో కొనసాగుతున్నాయని, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి. గీతే, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

- శ్వాసకోస వ్యాధుల పరీక్షలు, వైద్య సేవలు

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణం గాంధీనగర్‌లో గురువారం జిల్లా ప్రభుత్వ వైద్య యంత్రాంగం తరుపున ఉచిత చెస్ట్, శ్వాస కోస వ్యాధుల సంబంధిత వైద్య శిబిరాన్ని స్థానిక వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇందులో దగ్గు, దమ్ము, శ్వాస సంబంధిత వ్యాధుల నిర్ధారణ కొరకు డిజిటల్ చెస్ట్ ఎక్స్–రే సేవలు ఉచితంగా అందజేశారు. ఈ వైద్య శిబిరంలో వార్డు ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్, 18 వ వార్డు కౌన్సిలర్ మేర్గు మంజుల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, రేడియోగ్రాఫర్ బాలు, టి బి సూపర్ వైసర్ సంతోష్, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశ వర్కర్ శ్రీవేణి, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ లీక్‌లను అరికట్టే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదు

- యువత ఆందోళనలను చల్లార్చేందుకే సవరణ బిల్లు: ఖర్గే
- రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే



**న్యూఢిల్లీ:** పేపర్ లీక్‌ల సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో కాకుండా, ఉద్యమిస్తున్న యువతను శాంతింపజేయడానికే కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అన్యాయ పద్ధతుల నివారణ) సవరణ బిల్లును తీసుకొచ్చిందని రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. రాజ్యసభలో గురువారం బిల్లుపై జరిగిన చర్చలో ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పేపర్ లీక్‌లను అరికట్టేందుకు జరిమానాలు పెంచడం, శిక్షలను కఠినతరం చేయడం, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయడం మాత్రమే సరిపోదని ఖర్గే అన్నారు. పరీక్షల నిర్వహణ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకొస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. వ్యవస్థలో మార్పులు చేయకుండా ప్రతి ఏడాది ఇదే అంశంపై చర్చించాల్సిన పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల ఉద్యమాలు, ప్రతిపక్షాల నిరసనల కారణంగానే కేంద్ర ప్రభుత్వం మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తప్పించాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు. ప్రధానమంత్రి తన పదవిని కాపాడుకోవడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. పేపర్ లీక్‌ల అంశాన్ని రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలోనే ప్రస్తావించారని, 2024లోనే కఠిన చట్టం తీసుకురావాలని ప్రతిపక్షం డిమాండ్ చేసిందని గుర్తు చేశారు.

### హోంమంత్రి రాజీనామా చేయాలి

విద్యార్థులపై లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగాలకు ఎవరు ఆదేశాలు ఇచ్చారు? సాధారణ దుస్తుల్లో విద్యార్థులను కొట్టిన వ్యక్తులు ఎవరు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతే కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా పలుమార్లు పేపర్ లీక్‌లు జరిగినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఖర్గే ఆరోపించారు. 2024 నీట్ పేపర్ లీక్ కేసులో ప్రధాన నిందితుడికి క్లీన్ చిట్ ఇచ్చారని కూడా విమర్శించారు.

## భారతీయ నావికులపై దాడులు అంగీకారయోగ్యం కాదు

**భారతీయ నావికుల మృతిపై ఉక్రెయిన్ విదేశాంగ మంత్రితో జైశంకర్ ఆందోళన వ్యక్తం**



**న్యూఢిల్లీ:** నల్ల సముద్రంలో వాణిజ్య నౌకలు, భారతీయ నావికులను లక్ష్యంగా చేసుకుని ఏ పక్షం దాడులకు పాల్పడినా అవి పూర్తిగా అంగీకారయోగ్యం కావని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. అలాంటి ఘటనలను భారత్ ఎలాంటి సందేహం లేకుండా ఖండిస్తుందని ఆయన ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిహాకు తెలిపారు. గురువారం ఇరువురు మంత్రుల మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణలో ఈ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. ఇటీవల రష్యా–ఉక్రెయిన్ ఘర్షణల నేపథ్యంలో నల్ల సముద్రంలో వాణిజ్య నౌకలపై జరిగిన దాడుల్లో ఐదుగురు భారతీయ నావికులు మృతి చెందగా, మరో ఇద్దరు గల్లంతైనట్లు సమాచారం

## పెల్లెట్ గన్స్‌పై నిషేధం విధించలేం: సుప్రీంకోర్టు

- ప్రస్తుత మార్గదర్శకాలు అమల్లో ఉన్నంత వరకు వినియోగం చెల్లుబాటే
- దుర్వినియోగ ఆరోపణలను కేసుల వారీగా పరిశీలిస్తాం: సుప్రీం
- ఆర్‌పీఎఫ్ ఆయుధ వినియోగ రికార్డులు భద్రపరచాలని కేంద్రానికి ఆదేశం



**న్యూఢిల్లీ:** జనసమూహ నియంత్రణ కోసం అసాధారణ పరిస్థితుల్లో భద్రతా బలగాలు పెల్లెట్ గన్స్ వినియోగించేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న మార్గదర్శకాలు అనుమతిస్తున్నందున వాటిపై పూర్తిస్థాయి నిషేధం విధించడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, నిర్దిష్ట ఘటనల్లో పెల్లెట్ గన్స్ దుర్వినియోగానికి సంబంధించిన ఆరోపణలను కేసుల వారీగా పరిశీలించవచ్చని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో ఇటీవల నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా మెటాలిక్ పెల్లెట్ గన్స్ వినియోగించారంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. పెల్లెట్ గన్స్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కోరుతున్న పిటిషన్‌లో స్పష్టత లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పోలీసు నిబంధనలు అసాధారణ పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వినియోగానికి అనుమతి ఇస్తున్నాయని, వాటిని రాజ్యాంగంలోని జీవించే హక్కు (ఆర్టికల్ 21)కు విరుద్ధమని సవాలు చేయకుండా నిషేధం కోరడం సాధ్యం కాదని జస్టిస్ బాగ్చి వ్యాఖ్యానించారు.

### కేంద్రానికి నోటీసులు

ఈ కేసులో కేంద్ర ప్రభుత్వంతో పాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. జూలై 20న జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనల సందర్భంగా విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ ఉపయోగించిన ఆయుధాలు, మందుగుండు సామగ్రికి సంబంధించిన రికార్డులను భద్రపరచాలని కేంద్రాన్ని ఆదేశించింది. నిరసనల సందర్భంగా పెల్లెట్ గాయాలకు గురైన ప్రశాంత్ కుమార్, షేక్ ఇర్షాద్ మన్సూరి తదితరులకు అత్యుత్తమ వైద్య చికిత్స అందించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇదిలాఉంటే పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వృందా గ్రోవర్ వాదనలు వినిపిస్తూ, భద్రతా బలగాల ఆయుధాగారంలో పెల్లెట్ గన్స్ ఉండడంపై అభ్యంతరం కాదని, అయితే మెటాలిక్ పెల్లెట్ల వినియోగమే ప్రధాన సమస్య అని తెలిపారు. ఢిల్లీ పోలీసుల వద్ద అలాంటి వినియోగానికి సంబంధించిన స్టాండింగ్ ఆర్డర్ ఉంటే దానిని కోర్టు ముందు ఉంచాలని కేంద్రాన్ని కోరారు.

### దశలవారీ బలప్రయోగం అవసరం

శాంతియుతంగా ప్రారంభమైన నిరసనలు కొన్నిసార్లు సంఘవ్యతిరేక శక్తుల కారణంగా హింసాత్మకంగా మారే అవకాశం ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. అలాంటి సందర్భాల్లో పరిస్థితిని బట్టి భద్రతా బలగాలు దశలవారీగా బలప్రయోగం చేయాల్సి రావచ్చని అభిప్రాయపడింది.

## సీజేపీ నిరసనకారులపై ఇక చర్యల్లేవ్!

- ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం
- చలో పార్లమెంట్ ఆందోళన కేసులను ముగించాలని ఆదేశం
- ఇప్పటికే అరెస్టయిన వారి విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలన్న సర్కార్

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఛలో పార్లమెంట్ నిరసనలో పాల్గొన్న వారిపై ఇకపై ఎలాంటి ప్రతికూల చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నిరసనల్లో పాల్గొన్న వ్యక్తులపై భవిష్యత్తులో ఎలాంటి చట్టపరమైన చర్యలు కొనసాగించబోమని, ఈ వ్యవహారాన్ని ముగిసిన అంశంగా పరిగణించాలని హోంశాఖ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ కేసుల్లో అరెస్టు చేసిన లేదా అదుపులోకి తీసుకున్న వారి వ్యవహారాన్ని సమీక్షించి, విడుదల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. అయితే ఈ నిర్ణయం క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తులకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలకు అనుగుణంగా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని పేర్కొంది. జులై 20న సీజేపీ చేపట్టిన ఛలో పార్లమెంట్ ర్యాలీ సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ఢిల్లీ పోలీసులు మొత్తం 13 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఆ కేసుల నేపథ్యంలోనే ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది.

## చలో పార్లమెంట్ కేసులు పూర్తిగా ఎత్తేయ్యాలి

- సీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్

**న్యూఢిల్లీ:** ఛలో పార్లమెంట్ ఉద్యమానికి సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లపై ఇకపై చట్టపరమైన చర్యలు ఉండవని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించడాన్ని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) స్వాగతించింది. అయితే కేసులను కేవలం మూసివేయడం కాకుండా పూర్తిగా ఉపసంహరించుకోవాలని పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ డిమాండ్ చేశారు. జూలై 25న జంతర్‌మంతర్ వద్ద ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాన్ని ఎలాంటి మార్పులు లేకుండా అమలు చేయాలని, లేదంటే విద్యార్థులు మరోసారి ఉద్యమ బాట పట్టే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఢిల్లీ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఎఫ్ఐఆర్‌లను మూసివేస్తాం అనే పదజాలాన్ని ఉపయోగించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పష్టంగా ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకుంటున్నాం అని ప్రకటించాల్సిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల కారణంగా కేసులను ఉపసంహరించుకోలేమన్న ప్రభుత్వ వాదనలో వాస్తవం లేదని, అలాంటి నిషేధం ఎక్కడా లేదని పేర్కొన్నారు.

### ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవాలి

జూలై 25న దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పకుండా అమలు చేయాలని సౌరవ్ దాస్ కోరారు. ఒప్పందంలోని అంశాలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోతే దేశ యువత ప్రభుత్వాన్ని క్షమించదని, మళ్లీ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం జారీ చేయనున్న తుది ఉత్తర్వుల్లో తమ డిమాండ్లన్నీ ప్రతిబింబిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### క్రిమినల్ కేసుల నమోదుపైనా అభ్యంతరం

నిరసనల సందర్భంగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. ఎవరికైనా పరువు నష్టం జరిగితే చట్టబద్ధ మార్గాల్లో న్యాయం పొందే అవకాశం ఉందని, అయితే నిరసనకారులపై క్రిమినల్ చట్టాలను ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. అదే సమయంలో యువత కూడా తమ వ్యాఖ్యల్లో సంయమనం పాటించాలని సూచించారు.

## గ్వాలియర్‌లో టెలికాం తయారీ హబ్

- రూ.12 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం
- టెలికాం మ్యానుఫ్యాక్టరింగ్ జోన్‌కు కేంద్రం–మధ్యప్రదేశ్ మధ్య ఎంఓయూ

**న్యూఢిల్లీ:** దేశాన్ని ప్రపంచ స్థాయి టెలికాం తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ప్రతిష్ఠాత్మక టెలికాం మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ (టీఎంజెడ్) ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు ద్వారా రెండు దశల్లో రూ.10,000 నుంచి రూ.12వేల కోట్ల వరకు పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు కేంద్ర టెలికాం శాఖ, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల మధ్య గురువారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. 170 ఎకరాల విస్తీర్ణంలో ఈ జోన్‌ను అభివృద్ధి చేయనున్నారు. ప్రథమ దశలో రూ.2,000 కోట్ల పెట్టుబడులు, 4,500 ఉద్యోగాల కల్పన లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ, ఎంఓయూ అనంతరం నిర్వహించిన పెట్టుబడిదారుల సమావేశంలోనే అనూహ్య స్పందన లభించింది. మొత్తం 14 కంపెనీలు కలిపి రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టడంతో పాటు 14,500 మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించాయి.

### పెట్టుబడులకు ముందుకొచ్చిన దిగ్గజాలు

హెచ్‌ఎఫ్‌సీఎల్ రూ.700 కోట్లు, వీవీడీఎన్ రూ.500 కోట్లు, స్పార్క్ సీసీటీవీ రూ.300 కోట్లు, సిర్మా ఎస్‌జీఎస్ రూ.250 కోట్లు, డిక్సన్ టెక్నాలజీస్ రూ.200 కోట్లు, పారామౌంట్ కేబుల్ రూ.200 కోట్లు, ఆప్టిమస్ ఇన్‌ఫ్రాకామ్ రూ.150 కోట్లు, లావా ఇంటర్నేషనల్ రూ.130 కోట్ల పెట్టుబడులను ప్రకటించాయి. మరికొన్ని సంస్థలు కూడా ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం కానున్నట్లు అధికారులు తెలిపారు.

### 'డిజైన్ ఇన్ ఇండియా'కు కొత్త ఊపు

కేంద్ర సమాచార, టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ రెండో దశ పూర్తయ్యే నాటికి మొత్తం పెట్టుబడులు రూ.10,000–12,000 కోట్లకు చేరుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. టెలికాం శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మొబైల్, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో వినియోగించే విడిభాగాల్లో దాదాపు 80 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్నామని చెప్పారు. ఈ జోన్ ద్వారా 'డిజైన్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, ఎక్స్‌పోర్ట్ టు ది వరల్డ్' లక్ష్యాన్ని వేగంగా సాధించగలమని ఆయన పేర్కొన్నారు.

### భవిష్యత్ విస్తరణకు సిద్ధం

ఈ ప్రాజెక్టు కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్‌పీవీ)లో మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి 51 శాతం, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉంటుంది. భవిష్యత్‌లో ప్రాజెక్టును విస్తరించే దిశగా అదనంగా 500 ఎకరాల భూమిని కూడా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినట్లు టెలికాం శాఖ వెల్లడించింది. ఈ టెలికాం మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ భారతదేశాన్ని ప్రపంచ టెలికాం తయారీ రంగంలో కీలక కేంద్రంగా నిలబెట్టడంలో మైలురాయిగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## ఈ20 పెట్రోల్‌తో మైలేజ్ తగ్గొచ్చు

- ఇంజిన్‌కు మాత్రం ఎలాంటి నష్టం లేదు
- మెరుగవ్వనున్న యాక్సిలరేషన్, రైడింగ్ నాణ్యత
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: దేశంలో అమలవుతున్న 20 శాతం ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ (ఈ20) వినియోగంతో వాహనాల మైలేజ్ స్వల్పంగా తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, ఇంజిన్‌కు ఎలాంటి నష్టం వాటిల్లదని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. వాహనం రకం, వయస్సును బట్టి ఇంధన సామర్థ్యం 2 నుంచి 6 శాతం వరకు తగ్గవచ్చని ఆయన లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఈ20 ఇంధనం వినియోగంతో వాహనాల యాక్సిలరేషన్, రైడింగ్ నాణ్యత మెరుగుపడుతుందని గడ్కరీ పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం వినియోగిస్తున్న ఈ10 పెట్రోల్‌తో పోలిస్తే కార్బన్ ఉద్గారాలు సుమారు 30 శాతం వరకు తగ్గుతాయని వెల్లడించారు. దీంతో పర్యావరణ పరిరక్షణకు ఈ20 ఇంధనం మరింత ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు. ఈ20 ఇంధనం ప్రభావంపై ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) సంయుక్తంగా బీఎస్–3, బీఎస్–4, బీఎస్–6 ప్రమాణాల ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలపై విస్తృతంగా పరీక్షలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. డైనమోమీటర్, రోడ్డు పరీక్షల్లో ఈ20 ఇంధనం కారణంగా ఇంజిన్ వైఫల్యాలు లేదా ఇతర సాంకేతిక సమస్యలు ఏవీ గుర్తించలేదని స్పష్టం చేశారు.

### దశలవారీగా అమలు

ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ కార్యక్రమాన్ని నీతి ఆయోగ్, వాహన తయారీ సంస్థలు, చమురు మార్కెటింగ్ కంపెనీలు, ఏఆర్ఏఐ, సియామ్‌తో పాటు ఇతర సాంకేతిక సంస్థల సహకారంతో శాస్త్రీయంగా దశలవారీగా అమలు చేస్తున్నట్లు గడ్కరీ వివరించారు. 2001లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో 2006లో ఈ5 ఇంధనాన్ని ప్రవేశపెట్టగా, ప్రస్తుతం ఈ19–ఈ20 మిశ్రమ పెట్రోల్ దేశవ్యాప్తంగా రెండున్నరేళ్లుగా వినియోగంలో ఉందన్నారు.

### 20 కోట్లకు పైగా వాహనాల్లో వినియోగం

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, మూడు కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఈ20 మిశ్రమ ఇంధనాన్ని వినియోగిస్తున్నాయని గడ్కరీ తెలిపారు. ఈ ఇంధనం వల్ల ఇంజిన్ దెబ్బతినడం, వాహనాల ఆయుష్షు తగ్గడం లేదా అసాధారణ తుప్పు వంటి సమస్యలు ఉన్నట్లు ఎలాంటి ధ్రువీకరించిన ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఈ20 ఇంధనాన్ని ఉపయోగించే వాహనాలకు తయారీ సంస్థలు వారంటీని యథావిధిగా కొనసాగిస్తున్నాయని కూడా ఆయన వెల్లడించారు.

## మధ్యప్రాచ్యంలో ముదురుతున్న ఉద్రిక్తతలు

- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళన
- ఇంధన ధరలు పెరిగే ప్రమాదమని నిపుణుల హెచ్చరిక

**అంకారా:** మధ్యప్రాచ్యంలో ఒకేసారి పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న విభేదాలు, హోర్ముజ్ జలసంధి చుట్టూ పెరుగుతున్న ఉద్రిక్తతలు యెమెన్, ఇరాక్, జోర్డాన్, ఈజిప్టు, లెబనాన్ వంటి దేశాలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాలు ప్రపంచ ఇంధన సరఫరా, సముద్ర వాణిజ్యం, ప్రాంతీయ భద్రతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ చమురు, సహజవాయు రవాణాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిపై తమకే నియంత్రణ ఉందని ఇరాన్ ప్రకటిస్తోంది. ప్రత్యామ్నాయ సముద్ర మార్గాలను వినియోగిస్తున్న నౌకలపై దాడులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛకు భంగం కలగకుండా అమెరికా ప్రతిస్పందన చర్యలు చేపడుతుండగా, దీనికి ప్రతిగా జోర్డాన్, కువైట్ వంటి అమెరికా సైనిక స్థావరాలు ఉన్న ప్రాంతాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తున్నట్లు సమాచారం. ఇరాన్ మద్దతు ఉన్న యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై సముద్ర దిగ్బంధనాన్ని ప్రకటించారు. సౌదీ చమురు కేంద్రాలపై జరిగిన డ్రోన్ దాడులకు ఇరాన్ అనుకూల మిలీషియాలే కారణమని ఆరోపించిన సౌదీ అరేబియా, అమెరికాతో కలిసి ఇరాక్‌లోని ఆయా మిలీషియా స్థావరాలపై వైమానిక దాడులు నిర్వ హించింది. ఈ దాడుల్లో పలువురు మిలీషియా సభ్యులు, ఇరాన్‌కు చెందిన సలహాదారులు మరణించినట్లు సమాచారం. ఈ చర్యలను ఇరాక్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.

### ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం

మధ్యప్రాచ్యంలో విస్తరిస్తున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ, సముద్ర వాణిజ్యం, అంతర్జాతీయ భద్రతపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా చమురు రవాణా మార్గాలకు అంతరాయం ఏర్పడితే ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు, ఇంధన ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



## రాష్ట్రపతితో ప్రధాని భేటీ

- రాష్ట్రపతి భవన్‌లో సమావేశమైన మోడీ, ముర్ము
- భేటీకి సంబంధించిన చిత్రాలను విడుదల చేసిన రాష్ట్రపతి కార్యాలయం

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి కార్యాలయం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా వెల్లడించింది. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి సంబంధించిన చిత్రాలను రాష్ట్రపతి కార్యాలయం విడుదల చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాష్ట్రపతి భవన్‌లో కలిశారు అని 'ఎక్స్'లో పేర్కొంటూ భేటీ వివరాలను వెల్లడించింది. మోల్డోవా, ఉత్తర మాసిడోనియా, రొమేనియా దేశాల్లో వారం రోజుల అధికారిక విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకుని గత ఆదివారం భారత్‌కు తిరిగి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని మోదీ సమావేశం కావడం ఇదే తొలిసారి. ఈ భేటీ మర్యాదపూర్వక సమావేశంగా జరిగినట్లు రాష్ట్రపతి కార్యాలయం తెలిపింది.

## 656 మిలియన్ డాలర్ల పరిహారం అమలును నిలిపేయండి

- అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించిన పాలస్తీనా అథారిటీ, పీఎల్ఓ
- పరిహారం చెల్లిస్తే వెస్ట్‌బ్యాంక్‌లో ప్రభుత్వ సేవలు దెబ్బతింటాయని వాదన
- ఇజ్రాయెల్ దాడుల బాధితుల కుటుంబాలకు అనుకూలంగా గతంలో సుప్రీంకోర్టు తీర్పు

వాషింగ్టన్: ఇజ్రాయెల్‌లో జరిగిన ఉగ్రదాడుల్లో మరణించిన, గాయపడిన అమెరికన్ల కుటుంబాలకు 656 మిలియన్ డాలర్లు (సుమారు రూ.5,700 కోట్లకు పైగా) పరిహారం చెల్లించాలంటూ వెలువడిన తీర్పు అమలును తాత్కాలికంగా నిలిపివేయాలని పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్ఓ), పాలస్తీనా అథారిటీ అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. తీర్పుపై అప్పీల్ పెండింగ్‌లో ఉన్నందున పరిహారం చెల్లింపులను నిలిపివేయాలని అత్యవసర పిటిషన్‌లో కోరాయి. ప్రస్తుతం అంత భారీ మొత్తాన్ని చెల్లిస్తే వెస్ట్‌బ్యాంక్‌లో తాము అందిస్తున్న కీలక ప్రభుత్వ సేవలు తీవ్రంగా దెబ్బతింటాయని, అమాయక ప్రజలు నష్టపోతారని, ప్రాంతీయ భద్రత కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని కోర్టుకు తెలిపాయి.

### రెండు దశాబ్దాల న్యాయ పోరాటం

2000వ దశక ప్రారంభంలో జెరూసలేం ప్రాంతంలో జరిగిన దాడుల్లో 33 మంది మృతి చెందగా, వందలాది మంది గాయపడ్డారు. బాధితుల కుటుంబాలు అమెరికా యాంటీ–టెర్రరిజం చట్టం కింద పరిహారం కోసం దావా వేశాయి. ప్రారంభంలో న్యూయార్క్ ఫెడరల్ కోర్టు తీర్పును రద్దు చేసినప్పటికీ, అనంతరం చట్ట సవరణల నేపథ్యంలో కేసు కొనసాగింది. అనంతరం ఈ ఏడాది మార్చిలో రెండో సర్క్యూట్ అప్పీల్ కోర్టు కూడా 656 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలన్న తీర్పును పునరుద్ధరించింది. దీంతో ఇప్పుడు ఆ తీర్పు అమలును నిలిపివేయాలని పాలస్తీనా అథారిటీ, పీఎల్ఓ సుప్రీంకోర్టును కోరాయి.

## 860 గ్రాములతో పుట్టిన చిన్నారి

- ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి చేరిక
- వైద్యుల కృషి, తల్లి సంరక్షణతో 1.40 కిలోలకు పెరిగిన బరువు

భోపాల్: కేవలం 860 గ్రాముల బరువుతో అకాలంగా జన్మించి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరిన ఓ చిన్నారి, వైద్యుల నిరంతర చికిత్సతో పూర్తిగా కోలుకుని రెండు నెలల తర్వాత డిశ్చార్జ్ కావడం విశేషం. ప్రస్తుతం ఆ చిన్నారి బరువు 1.40 కిలోలకు చేరిందని వైద్యులు తెలిపారు. వైద్యుల వివరాల ప్రకారం, చిన్నారి మే 30న గర్భధారణ 25వ వారంలోనే ఇంట్లో జన్మించింది. జననం జరిగిన ఎనిమిది గంటల తర్వాత రత్లాం జిల్లా ఆస్పత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో చేర్పించారు. పూర్తి గర్భకాలం నిండకముందే పుట్టడం వల్ల ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందక శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. చిన్నారికి తొలి 15 రోజుల పాటు సీప్యాప్ ద్వారా శ్వాస సహాయం అందించారు. అనంతరం ఆక్సిజన్ థెరపీ కొనసాగించారు. చికిత్స ప్రారంభ దశలో చిన్నారి బరువు 860 గ్రాముల నుంచి 690 గ్రాములకు తగ్గిపోయింది. రక్తహీనత కారణంగా రక్తమార్పిడి కూడా చేయాల్సి వచ్చింది. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ఫీడింగ్ ట్యూబ్ ద్వారా తల్లి పాలను అందించడం ప్రారంభించారు. అనంతరం మోతాదును క్రమంగా పెంచారు. అలాగే తల్లికి కంగారూ మదర్ కేర్ విధానంపై శిక్షణ ఇచ్చి చర్మం–చర్మం స్పర్శ ద్వారా శిశు సంరక్షణ చేపట్టేలా మార్గనిర్దేశం చేశారు. సుమారు రెండు నెలల చికిత్స అనంతరం చిన్నారి పూర్తిగా కోలుకోవడంతో జూలై 28న ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. డిశ్చార్జ్ సమయానికి చిన్నారి బరువు 1.40 కిలోలు ఉండగా, వైద్యుల సేవలు, తల్లి అంకితభావంతో చేసిన సంరక్షణ ఫలితంగానే ఈ అరుదైన విజయం సాధ్యమైందని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

## గర్భం కారణంగా ఉద్యోగానికి అనర్హురాలు కాదు

**అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు**

లక్నో: గర్భం దాల్చిన మహిళను ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హురాలిగా పరిగణించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. మాతృత్వం లేదా ఉద్యోగం.. ఈ రెండింటిలో ఒకదాన్ని ఎంచుకోవాలని మహిళను బలవంతం చేయడం ఆమె పునరుత్పత్తి హక్కుతో పాటు జీవనోపాధి హక్కును కూడా ఉల్లంఘించడమేనని పేర్కొంటూ కీలక తీర్పు వెలువరించింది. ఉత్తరప్రదేశ్ సబ్‌ఆర్డినేట్ సర్వీసెస్ సెలెక్షన్ కమిషన్ (యూపీఎస్ఎస్ఎస్‌సీ) నిర్వహిస్తున్న ఫారెస్ట్ గార్డ్, వైల్డ్‌లైఫ్ గార్డ్ నియామకాల ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పీఈటీ)ను ప్రసవం తర్వాత నిర్వహించాలని కోరిన కోమల్ జైస్వాల్ విజ్ఞప్తిని కమిషన్ తిరస్కరించడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి అరుణ్ భన్సాలీ, జస్టిస్ జస్ప్రీత్ సింగ్‌ల ధర్మాసనం మహిళ హక్కులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

### నాలుగు వారాల్లో పీఈటీ నిర్వహించాలి

2023 నియామక ప్రక్రియలో రాత పరీక్షలో అర్హత సాధించిన కోమల్ జైస్వాల్, 2026 ఫిబ్రవరిలో జరగాల్సిన పీఈటీ సమయానికి తొమ్మిది నెలల గర్భిణిగా ఉండటంతో పరీక్షను ప్రసవం అనంతరం నిర్వహించాలని కోరారు. అయితే సంబంధిత నిబంధనల్లో అలాంటి వెసులుబాటు లేదంటూ కమిషన్ ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. దీనిని సమర్థించలేమని పేర్కొన్న హైకోర్టు, నాలుగు వారాల్లో ఆమెకు ప్రత్యేకంగా పీఈటీ నిర్వహించాలని ఆదేశించింది.

### ఉద్యోగావకాశాన్ని కాపాడాలని ఆదేశం

కోమల్ జైస్వాల్ పీఈటీ, వైద్య పరీక్షలు పూర్తి చేసి మెరిట్‌లో అర్హత సాధిస్తే, అదే నియామక ప్రక్రియలో ఎంపికైన ఇతర అభ్యర్థులతో సమానంగా ఆమెకు ఉద్యోగం కల్పించాలని హైకోర్టు ఆదేశించిం ది. అప్పటి వరకు సంబంధిత వర్గంలో ఒక పోస్టును ఖాళీగా ఉంచాలని యూపీఎస్ఎస్ఎస్‌సీకి స్పష్టం చేసింది. ఈ తీర్పు గర్భిణి మహిళల ఉపాధి హక్కుల పరిరక్షణలో కీలకంగా నిలుస్తుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కామన్వెల్త్‌లో భారత్‌కు పతకాల పంట

- వెయిట్‌లిఫ్టింగ్‌లో లవ్‌ప్రీత్‌కు రజతం
- డిస్కస్ త్రోలో సీమ కలీరామ్‌నాకు కాంస్యం
- జావెలిన్ ఫైనల్‌కు నీరజ్‌తో పాటు రోహిత్, యశ్వీర్ అర్హత





**గ్లాస్గో:** కామన్వెల్త్ క్రీడల్లో భారత్ విజయాల జోరు కొనసాగుతోంది. గురువారం జరిగిన పోటీల్లో వెయిట్‌లిఫ్టింగ్‌లో లవ్‌ప్రీత్ సింగ్ రజత పతకం గెలవగా, మహిళల డిస్కస్ త్రోలో సీమ కలీరామ్‌నా కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు ఒలింపిక్ స్వర్ణ విజేత నీరజ్ చోప్రాతో పాటు రోహిత్ యాదవ్, యశ్వీర్ సింగ్‌లు జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించి భారత్‌కు మరో పతకాల ఆశలను పెంచారు. పంజాబ్‌కు చెందిన లవ్‌ప్రీత్ సింగ్ స్నాచ్‌లో 176 కిలోలు ఎత్తి కామన్వెల్త్ క్రీడల రికార్డును నెలకొల్పాడు. మొత్తం 388 కిలోలు (176+212) ఎత్తిన అతడు కేవలం ఒక కిలో తేడాతో న్యూజిలాండ్‌కు చెందిన డేవిడ్ ఆండ్రూ లిటి (389 కిలోలు) చేతిలో స్వర్ణాన్ని కోల్పోయి రజతంతో సరిపెట్టుకున్నాడు. బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో సాధించిన కాంస్యాన్ని ఈసారి రజతంగా మెరుగుపరుచుకున్నాడు. దీంతో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ ఖాతాలో ఒక స్వర్ణం, ఆరు రజతాలు, ఒక కాంస్యంతో మొత్తం ఎనిమిది పతకాలు చేరాయి. మహిళల డిస్కస్ త్రోలో సీమ కలీరామ్‌నా 58.65 మీటర్ల అత్యుత్తమ త్రోతో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. మరో భారత అథ్లెట్ నిధి రాణి 55.67 మీటర్లతో నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతకాన్ని చేజార్చుకుంది.

## జావెలిన్‌లో భారత్ ఆశలు

తీవ్ర గాలుల మధ్య జరిగిన అర్హత పోటీల్లో నీరజ్ చోప్రా 79.61 మీటర్లు, రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు, యశ్వీర్ సింగ్ 78.36 మీటర్లు విసిరి ఫైనల్‌కు చేరారు. ముగ్గురు భారత అథ్లెట్లు ఫైనల్‌లోకి ప్రవేశించడంతో జావెలిన్‌లో భారత్‌కు పతకాలపై ఆశలు మరింత బలపడ్డాయి. ఇతర విభాగాల్లో డెకాథ్లాన్‌లో తొలి రోజు ముగిసే సరికి తేజస్విన్ శంకర్ 4,339 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్, సెల్వ ప్రభు ఫైనల్‌కు అర్హత సాధించారు. షాట్‌పుట్‌లో తాజిందర్‌పాల్ సింగ్ తూర్ ఐదో స్థానంలో నిలిచాడు. 200 మీటర్లలో అనిమేష్ కుజూర్, 400 మీటర్లలో విశాల్ టీకే ఫైనల్‌కు చేరలేకపోయారు. లాన్‌బౌల్స్ పురుషుల జోడీ విభాగంలో నవ్‌నీత్ సింగ్, దినేశ్‌కుమార్ వరుసగా మూడో విజయాన్ని నమోదు చేయగా, సైక్లింగ్‌లో లిషా దాస్, పురుషుల టీమ్ స్ప్రింట్ జట్టు నిరాశపరిచాయి.

## 10వ స్థానంలో భారత్

కామన్వెల్త్ క్రీడల ఎనిమిదో రోజు ముగిసే సరికి భారత్ పతకాల పట్టికలో 10వ స్థానాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు భారత్ 3 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్యాలతో మొత్తం 17 పతకాలు సాధించి టాప్–10లో నిలిచింది. పతకాల పట్టికలో ఆస్ట్రేలియా తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఆ దేశం 51 స్వర్ణాలు, 24 రజతాలు, 35 కాంస్యాలతో మొత్తం 110 పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. 15 స్వర్ణాలు, 30 రజతాలు, 20 కాంస్యాలతో మొత్తం 65 పతకాలు గెలుచుకున్న ఇంగ్లండ్ రెండో స్థానంలో ఉండగా, 45 పతకాలతో కెనడా మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఆతిథ్య స్కాట్లాండ్ నాలుగో స్థానంలో కొనసాగుతుండగా.. నైజీరియా, దక్షిణాఫ్రికా, మలేసియా, న్యూజిలాండ్, జమైకా తొలి తొమ్మిది స్థానాల్లో నిలిచాయి. భారత్ తర్వాత వేల్స్ 11వ స్థానంలో కొనసాగుతోంది.



# అంతర్జాతీయ క్రికెట్‌కు రహానే గుడ్‌బై

- అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్

**ముంబై:** భారత సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు గురువారం వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్మెంట్‌ను ప్రకటిస్తూ.. ప్రతి ప్రారంభానికి ఒక ముగింపు ఉంటుందని, కొత్త ప్రయాణాన్ని ప్రారంభించే సమయం వచ్చిందని పేర్కొన్నాడు. 2013లో భారత జట్టులో అరంగేట్రం చేసిన 38ఏళ్ల రహానే.. 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో 5,077 పరుగులతో 12 సెంచరీలు, వన్డేల్లో 2,962 పరుగులతో మూడు సెంచరీలు నమోదు చేశాడు. రహానే కెరీర్‌లో 2020–21 బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ అత్యంత గుర్తుండిపోయే ఘట్టంగా నిలిచింది. క్లిష్ట పరిస్థితుల్లో భారత జట్టును నడిపించి, గబ్బా వేదికగా ఆస్ట్రేలియాపై 2–1తో చారిత్రక సిరీస్ విజయాన్ని అందించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేస్తూ క్రికెట్‌తో తన అనుబంధాన్ని కొనసాగిస్తానని రహానే వెల్లడించాడు.

# ఇంగ్లండ్ టెస్టు కోచ్‌గా ఫ్లెమింగ్

- యాషెస్ వైఫల్యంతో మెకల్లమ్‌కు ఉద్వాసన
- టెస్టు కెప్టెన్‌గా మళ్లీ జో రూట్ నియామకం



**లండన్:** ఇంగ్లండ్ పురుషుల టెస్టు జట్టుకు న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను ప్రధాన కోచ్‌గా నియమించినట్లు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ప్రకటించింది. యాషెస్‌లో 1–4తో పరాజయం, న్యూజిలాండ్‌తో స్వదేశంలో సిరీస్ ఓటమి నేపథ్యంలో బ్రెండన్ మెకల్లమ్‌ను టెస్టు జట్టు కోచ్ పదవి నుంచి తప్పించింది. అయితే వన్డే, టీ20 జట్ల కోచ్‌గా ఆయన కొనసాగనున్నాడు. ఆగస్టులో జరిగే పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్ అనంతరం ఫ్లెమింగ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ సిరీస్‌కు మార్కస్ ట్రెస్కోథిక్ తాత్కాలిక కోచ్‌గా వ్యవహరిస్తారు. ఇదే సందర్భంగా బెన్ స్టోక్స్ రిటైర్మెంట్‌తో ఖాళీ అయిన టెస్టు కెప్టెన్సీని జో రూట్‌కు మరోసారి అప్పగించారు. న్యూజిలాండ్‌కు 80 టెస్టుల్లో నాయకత్వం వహించిన ఫ్లెమింగ్.. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు టైటిళ్లు అందించిన విజయవంతమైన కోచ్‌గా గుర్తింపు పొందాడు.



# 12 వేదికలు.. 57 మ్యాచ్‌లు

- కొత్త ఫార్మాట్‌లో 2027 ప్రపంచకప్ టోర్నీ
- తొలుత 12–14 ర్యాంకు జట్ల మధ్య సూపర్ సిరీస్
- తర్వాత రెండు గ్రూపులుగా 12 జట్లతో లీగ్ మ్యాచ్‌లు

**జోహన్నెస్‌బర్గ్:** 2027 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌కు ఆఫ్రికా ఖండం మరోసారి వేదిక కానుంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఈ మెగా టోర్నీకి ఆతిథ్యం ఇవ్వనున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. మొత్తం 12 వేదికల్లో ప్రపంచకప్ మ్యాచ్‌లు నిర్వహించనుండగా.. వాటిలో ఎనిమిది దక్షిణాఫ్రికాలో, మూడు జింబాబ్వేలో, ఒకటి నమీబియాలో ఉన్నాయి. దాదాపు 24 ఏళ్ల తర్వాత వన్డే ప్రపంచకప్ మళ్లీ ఆఫ్రికా ఖండానికి చేరుతోంది. 2003లో దక్షిణాఫ్రికా, జింబాబ్వే, కెన్యా సంయుక్తంగా ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇచ్చిన తర్వాత మరోసారి ఈ ప్రాంతంలో టోర్నీ జరగనుంది. దక్షిణాఫ్రికాలో జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్, సెంచూరియన్, కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్, డర్బన్‌లోని కింగ్స్‌మీడ్‌తో పాటు సెయింట్ జార్జ్ పార్క్, మంగాంగ్ ఓవల్, బోలాండ్ పార్క్, బఫెలో పార్క్ వేదికలుగా ఎంపికయ్యాయి. జింబాబ్వేలో హరారే స్పోర్ట్స్ క్లబ్, క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్, విక్టోరియా ఫాల్స్‌లో నిర్మిస్తున్న కొత్త అంతర్జాతీయ స్టేడియంలో పోటీలు నిర్వహించనున్నారు. నమీబియా రాజధాని విండ్‌హోక్‌లోని నమీబియా క్రికెట్ గ్రౌండ్ కూడా ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈసారి ప్రపంచకప్‌ను కొత్త ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. మొత్తం 57 మ్యాచ్‌లు జరిగే ఈ టోర్నీలో తొలుత 12 నుంచి 14వ ర్యాంకు జట్ల మధ్య సూపర్ సిరీస్ నిర్వహించి విజేతను ప్రధాన టోర్నీలోకి ఎంపిక చేస్తారు. అనంతరం 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించి లీగ్ దశ పోటీలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి అగ్ర జట్లు సూపర్–7 దశకు చేరుకోగా, చివరకు తొలి నాలుగు జట్లు సెమీఫైనల్స్‌లో తలపడతాయి. ఈ సందర్భంగా ఐసీసీ చైర్మన్ జయ్ షా మాట్లాడుతూ.. ఆఫ్రికాలో మరోసారి ప్రపంచకప్ నిర్వహించడం ప్రపంచ క్రికెట్‌కు చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. మూడు ఆతిథ్య దేశాలు కలిసి అభిమానులకు చిరస్మరణీయమైన టోర్నీని అందిస్తాయనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.




# ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌కు 9శాతం లాభాల వృద్ధి

- తొలి త్రైమాసిక నికర లాభం రూ.1,488 కోట్లకు చేరిక
- ఎన్‌పీఏలు తగ్గుముఖం.. ఆదాయం క్షీణింపు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ ప్రోత్సహిత ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 9 శాతం లాభాల వృద్ధిని నమోదు చేసింది. కంపెనీ నికర లాభం గత ఏడాది ఇదే కాలంలోని రూ.1,360 కోట్ల నుంచి రూ.1,488 కోట్లకు పెరిగింది. కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం రూ.7,233 కోట్ల నుంచి రూ.7,066 కోట్లకు తగ్గింది. వడ్డీ ఆదాయం కూడా రూ.7,113 కోట్ల నుంచి రూ.7,024 కోట్లకు క్షీణించినట్లు సంస్థ నియంత్రణ సంస్థలకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది. మరోవైపు మొత్తం వ్యయాలు రూ.5,534 కోట్ల నుంచి రూ.5,177 కోట్లకు తగ్గాయి. కంపెనీ ఆస్తుల నాణ్యతలో కూడా మెరుగుదల కనిపించింది. స్థూల నిరర్థక ఆస్తుల (గ్రాస్ ఎన్‌పీఏ) నిష్పత్తి గత ఏడాది జూన్‌లోని 2.62 శాతం నుంచి 2.14 శాతానికి తగ్గింది. నికర ఎన్‌పీఏలు కూడా 1.30 శాతం నుంచి 1.12 శాతానికి తగ్గడం విశేషం.

కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో కీలక నాయకత్వ మార్పులను సంస్థ గురువారం ప్రకటించింది. ప్రస్తుతం మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా ఉన్న రమేశ్ శ్రీనివాసన్‌ను ఆగస్టు 1 నుంచి మూడేళ్ల కాలానికి బోర్డు నాన్–ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా నియమించింది. సంస్థతో చాలా కాలంగా అనుబంధం ఉన్న వి. జయశంకర్, సౌరవ్ మల్లిక్‌కు పదోన్నతి కల్పించినట్లు కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ వెల్లడించింది.

భారత్‌ను ప్రపంచ కమోడిటీ మార్కెట్లలో ధరల నిర్ణయ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్లోబల్ కమోడిటీ కాన్‌క్లేవ్–2026 పేరుతో మూడురోజుల అంతర్జాతీయ సదస్సును ముంబైలో నిర్వహించనున్నట్లు కమోడిటీ మార్కెట్ వర్గాలు ప్రకటించాయి. ఈ సదస్సులో విధాన నిర్ణేతలు, అంతర్జాతీయ ఎక్స్ఛేంజీలు, మార్కెట్ మౌలిక సదుపాయాల సంస్థలు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు, ఎస్ఎంఈలు, ఆర్థిక సంస్థలు, రిటైల్ ట్రేడర్లు పాల్గొని కమోడిటీ మార్కెట్ల భవిష్యత్‌పై చర్చించనున్నారు.




# ఇండిగోతో ఇన్‌క్రెడిబుల్ ఇండియా

- భారత పర్యాటక రంగానికి కొత్త ఊపు
- ప్రపంచవ్యాప్తంగా పర్యాటక ప్రచారానికి కేంద్రం–ఇండిగో భాగస్వామ్యం
- అంతర్జాతీయ వేదికలపై భారత ప్రత్యేకతల ఆవిష్కరణ

**న్యూఢిల్లీ:** భారతదేశాన్ని ప్రపంచ పర్యాటక పటంలో మరింత ప్రముఖ స్థానంలో నిలబెట్టే లక్ష్యంతో కేంద్ర పర్యాటక శాఖ దేశీయ విమానయాన సంస్థ ఇండిగోతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై ఇరు సంస్థలు గురువారం సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ద్వారా ఇన్‌క్రెడిబుల్ ఇండియా బై ఇండిగో పేరుతో భారత పర్యాటక విశేషాలను ప్రపంచవ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రచారం చేయనున్నారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సమక్షంలో ఒప్పంద పత్రాలను ఇరు సంస్థల ప్రతినిధులు పరస్పరం మార్చుకున్నారు. భారతదేశంలోని ప్రముఖ పర్యాటక గమ్యస్థానాలను అంతర్జాతీయ ప్రయాణికులకు చేరువ చేయడంతో పాటు దేశీయ పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించడమే ఈ భాగస్వామ్యం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని డిజిటల్, ప్రింట్ మీడియా, విమానాశ్రయాల్లో బ్రాండింగ్, విమానాల్లోని ఇన్‌ఫ్లైట్ వేదికలు, సోషల్ మీడియా, అంతర్జాతీయ ట్రావెల్ ఎగ్జిబిషన్లు తదితర మార్గాల ద్వారా నిర్వహించనున్నారు.

## ప్రపంచవ్యాప్తంగా ప్రచారం

కేంద్ర ప్రభుత్వ ఇన్‌క్రెడిబుల్ ఇండియా బ్రాండ్‌కు ఇండిగో విస్తృత దేశీయ, అంతర్జాతీయ విమాన నెట్‌వర్క్ తోడవడంతో భారత పర్యాటక రంగానికి ప్రపంచవ్యాప్తంగా మరింత ప్రచారం లభిస్తుందని మంత్రి షెకావత్ పేర్కొన్నారు. ఈ ప్రచారంలో భారత సాంస్కృతిక వారసత్వం, ప్రకృతి సోయగాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, వెల్‌నెస్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం, వన్యప్రాణి పర్యాటకం వంటి ప్రత్యేక ఆకర్షణలను ప్రధానంగా ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. ప్రచారానికి అవసరమైన బ్రాండ్ మెటీరియల్, సమాచారాన్ని కేంద్ర పర్యాటక శాఖ అందించగా, ఇండిగో తన డిజిటల్ వేదికలు, వినియోగదారుల కమ్యూనికేషన్ చానళ్ల ద్వారా భారత పర్యాటక గమ్యస్థానాలను విస్తృతంగా ప్రచారం చేయనుంది. ప్రారంభంగా రెండేళ్లపాటు అమల్లో ఉండనున్న ఈ అవగాహన ఒప్పందం ద్వారా దేశ పర్యాటక రంగానికి కొత్త ఊపు లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. కాగా, ఇదే తరహాలో కేంద్ర పర్యాటక శాఖ ఇటీవల ఎయిర్ ఇండియాతో కూడా వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడం గమనార్హం.

# రెండో రోజు లాభాల్లో మార్కెట్లు

- సెన్సెక్స్ 274 పాయింట్లు, నిఫ్టీ 67 పాయింట్లు ఎగిసిన సూచీలు
- బ్లూచిప్ షేర్ల కొనుగోళ్లు, విదేశీ పెట్టుబడుల ప్రవాహంతో జోష్
- చివరి గంట కొనుగోళ్లతో లాభాల్లో ముగింపు



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం వరుసగా రెండో రోజు లాభాలతో ముగిశాయి. బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐలు) నుంచి పెట్టుబడుల ప్రవాహం మార్కెట్లకు బలాన్నిచ్చాయి. రోజంతా ఒడిదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో చివరి గంటలో కొనుగోళ్లు ఊపందుకోవడంతో ప్రధాన సూచీలు లాభాల్లో నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 273.55 పాయింట్లు (0.35 శాతం) పెరిగి 77,928.15 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 66.95 పాయింట్లు (0.28 శాతం) లాభపడి 24,317.15కు చేరుకుంది. ట్రేడింగ్ సమయంలో సెన్సెక్స్ 566 పాయింట్ల మేర హెచ్చుతగ్గులు నమోదు చేసింది. సెన్సెక్స్‌లో మారుతి సుజుకి, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పవర్ గ్రిడ్ షేర్లు లాభపడగా.. అదానీ పోర్ట్స్, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు నష్టపోయాయి. బుధవారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.2,981.87 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేసినట్లు ఎక్స్ఛేంజ్ గణాంకాలు వెల్లడించాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించడం, ముడి చమురు ధరల పెరుగుదల, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మార్కెట్లపై ప్రభావం చూపినప్పటికీ, రూపాయి బలపడటం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, తొలి త్రైమాసిక కార్పొరేట్ ఫలితాలు ఆశాజనకంగా ఉండటం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచాయని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఆటో, చమురు–గ్యాస్ రంగాల సూచీలు లాభపడగా, రియాల్టీ, సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగాలు నష్టాల్లో ముగిశాయి.

# మహీంద్రా ఈవీ విభాగానికి భారీ పెట్టుబడి

- రూ.322 కోట్లు సమీకరించిన మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ

**ముంబై:** మహీంద్రా అండ్ మహీంద్రా తన ఎలక్ట్రిక్ త్రీ–వీలర్ వ్యాపార విభాగమైన మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ లిమిటెడ్ కోసం సుమారు రూ.322 కోట్ల పెట్టుబడిని సమీకరించింది. ఈ పెట్టుబడి సమీకరణతో కంపెనీ విలువ రూ.10,822 కోట్లకు చేరగా, ఈవీ రంగంలో యూనికార్న్ హోదాను సొంతం చేసుకుంది. సుస్థిర పెట్టుబడులకు పేరుగాంచిన గ్లోబల్ ఫండ్ లైట్‌రాక్ ఈ పెట్టుబడి రౌండ్‌కు నాయకత్వం వహించింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ), ఇండియా–జపాన్ ఫండ్ (ఐజేఎఫ్) కూడా ఈ రౌండ్‌లో పాల్గొన్నాయి. గత నాలుగేళ్లలో మహీంద్రా ఎలక్ట్రిక్ త్రీ–వీలర్ల అమ్మకాలు ఆరు రెట్లు పెరిగాయని తెలిపింది. ఎలక్ట్రిక్ త్రీ–వీలర్ మార్కెట్‌లో అగ్రస్థానాన్ని కొనసాగిస్తున్న సంస్థ, 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఒక లక్ష ఎలక్ట్రిక్ త్రీ–వీలర్ల విక్రయ మైలురాయిని చేరిన తొలి భారతీయ ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహన తయారీ సంస్థగా నిలిచింది. ఈ పెట్టుబడితో 10 లక్షల ఈవీలను రోడ్లపైకి తీసుకురావాలన్న లక్ష్యానికి చేరువయ్యామని కంపెనీ పేర్కొంది.

# జెప్టోకు ప్రీ–ఐపీఓ బూస్ట్

- రూ.1,000 కోట్ల సమీకరణకు రంగం సిద్ధం
- 4.5 బిలియన్ డాలర్ల విలువతో కొత్త పెట్టుబడుల సమీకరణ

**న్యూఢిల్లీ:** ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో ప్రీ–ఐపీఓ దశలో భారీ నిధుల సమీకరణకు సిద్ధమైంది. సుమారు రూ.1,000 కోట్ల పెట్టుబడులను సమీకరించేందుకు సంస్థ కసరత్తు చేస్తుండగా, కంపెనీ విలువను 4.5 బిలియన్ డాలర్లుగా నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ నిధుల సమీకరణలో ప్రధానంగా దేశీయ పెట్టుబడిదారులే పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జెప్టోలో భారతీయ పెట్టుబడిదారుల వాటా సుమారు 40 శాతం ఉండగా, దానిని మరింత పెంచడమే తాజా ఫండింగ్ రౌండ్ ప్రధాన ఉద్దేశమని సమాచారం. తొలుత 2026 జూలైలో ఐపీఓకు వెళ్లాలని సంస్థ భావించినప్పటికీ, ప్రస్తుతానికి ఆ ప్రణాళికను వాయిదా వేసింది. మార్కెట్ పరిస్థితులు, పెట్టుబడి వ్యూహాలను దృష్టిలో ఉంచుకుని ముందుగా మూలధనాన్ని బలోపేతం చేయాలని సంస్థ నిర్ణయించినట్లు తెలుస్తోంది. గత ఏడాది అక్టోబర్‌లో కాల్‌పర్స్ నేతృత్వంలోని ఫండింగ్ రౌండ్‌లో 450 మిలియన్ డాలర్లు సమీకరించినప్పుడు జెప్టో విలువ 7 బిలియన్ డాలర్లుగా ఉండేది. ప్రస్తుతం ప్రీ–ఐపీఓ రౌండ్‌లో అది 4.5 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం మాజీ విద్యార్థులు ఆదిత్ పలిచా, కైవల్య వోహ్రా స్థాపించిన ఈ సంస్థ, 2025 డిసెంబరులో సెబీకి గోప్య విధానంలో ఐపీఓ ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. ప్రతిపాదిత ఐపీఓలో రూ.8,010 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు, ప్రస్తుత వాటాదారుల నుంచి 11.35 కోట్ల ఈక్విటీ షేర్ల ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కూడా ఉండనుంది.

## వేగంగా విస్తరిస్తున్న జెప్టో

2025–26 ఆర్థిక సంవత్సరంలో జెప్టో రూ.22,624 కోట్ల నిర్వహణ ఆదాయం నమోదు చేసింది. మార్చి 2026 నాటికి దేశవ్యాప్తంగా 1,139 స్టోర్లు, సుమారు 4.8 కోట్ల వార్షిక వినియోగదారులు ఉన్నారు. రోజుకు సగటున 17.5 లక్షల ఆర్డర్లను ప్రాసెస్ చేస్తూ దేశీయ క్విక్ కామర్స్ రంగంలో సంస్థ తన ఉనికిని మరింత బలోపేతం చేసుకుంటోంది.



# హారర్ థ్రిల్లర్‌కు జాక్వెలిన్ గ్రీన్‌సిగ్నల్

వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ గ్లామర్‌తో పాటు నటనకూ సమాన ప్రాధాన్యం ఇస్తున్న బాలీవుడ్ అందాల తార జాక్వెలిన్ ఫెర్నాండెజ్ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక గీతాలతో కుర్రకారును అలరించడమే కాకుండా, కథకు ప్రాధాన్యం ఉన్న చిత్రాల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె, తాజాగా ఓ హారర్ మిస్టరీ థ్రిల్లర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు బాలీవుడ్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇటీవల 'వెల్‌కమ్ టు ది జంగిల్' చిత్రంలో సందడి చేసిన జాక్వెలిన్, ఇప్పుడు పూర్తిగా భిన్నమైన కథాంశంతో తెరకెక్కనున్న చిత్రంలో ప్రధాన పాత్ర పోషించనున్నట్లు సమాచారం. 1964లో విడుదలై క్లాసిక్ మిస్టరీ థ్రిల్లర్‌గా గుర్తింపు పొందిన హిందీ చిత్రం 'వహ్ కౌన్ థీ' స్ఫూర్తితో ఈ సినిమాను రూపొందించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇది రీమేక్ కాకుండా, ఆధునిక నేపథ్యంలో కొత్త కథనంతో రూపొందించనున్నట్లు సమాచారం. ఈ చిత్ర కథ భయానక వాతావరణంతో నిండిన ఓ చిన్న గ్రామం నేపథ్యంలో సాగనుంది. అనుకోని పరిస్థితుల్లో ఆ గ్రామంలో చిక్కుకుపోయిన యువతి, అక్కడ దాగి ఉన్న రహస్యాలను ఛేదిస్తూ బయటపడేందుకు చేసే పోరాటమే సినిమా ప్రధాన ఆకర్షణగా ఉండనుంది. కథలో మిస్టరీ, సస్పెన్స్, హారర్ అంశాలతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యం ఉంటుందని తెలుస్తోంది. జాక్వెలిన్ పాత్రను చాలా పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్దినట్లు సమాచారం. ఇప్పటివరకు ఆమె చేయని తరహాలో యాక్షన్ సన్నివేశాల్లో కనిపించనున్నారని, ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకునే అవకాశముందని బాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా కొన్ని ఉత్కంఠభరితమైన యాక్షన్ ఘట్టాలు సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ–ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. దర్శకుడు, ఇతర నటీనటుల ఎంపికతో పాటు చిత్రీకరణకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయని, త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించి వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. జాక్వెలిన్ కెరీర్‌లో ఈ చిత్రం మరో విభిన్నమైన మైలురాయిగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# పెళ్లిచూపులు మూవీకి పదేళ్లు



తెలుగు సినీ పరిశ్రమలో చిన్న సినిమాగా విడుదలై సంచలన విజయాన్ని అందుకున్న 'పెళ్లిచూపులు' విడుదలై జులై 29 పదేళ్లు పూర్తి చేసుకుంది. విజయ్ దేవరకొండ, రీతూ వర్మ జంటగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 2016లో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకోవడమే కాకుండా, తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. దర్శకుడిగా తరుణ్ భాస్కర్ పరిచయమైన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత డి. సురేశ్ బాబు సమర్పణలో రాజ్ కందురి, యష్ రంగినేని సంయుక్తంగా నిర్మించారు. సహజమైన కథనం, వినోదభరితమైన సంభాషణలు, కొత్త తరహా స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, అప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని పలువురు ప్రతిభావంతులకు కొత్త అవకాశాలు తెచ్చిపెట్టింది. 'పెళ్లిచూపులు' విజయ్ దేవరకొండ కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. సోలో హీరోగా ఆయనకు ఇది తొలి పెద్ద విజయం. సినిమాలో విజయ్ నటన, సహజమైన డైలాగ్ డెలివరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా విజయంతో వరుస అవకాశాలు అందుకున్న విజయ్, ఆ తర్వాత 'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం' వంటి విజయాలతో స్టార్ హీరోగా ఎదిగారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన రీతూ వర్మ తన సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు దక్కించుకుని ప్రముఖ కథానాయికగా గుర్తింపు పొందింది. ఇక దర్శకుడు తరుణ్ భాస్కర్ తొలి సినిమాతోనే తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్నారు. 'పెళ్లిచూపులు' తర్వాత టాలీవుడ్‌లో క్రేజీ దర్శకుడిగా ఎదిగిన ఆయన, అనంతరం నటుడిగానూ తనదైన గుర్తింపు సంపాదించారు.బాక్సాఫీస్ దగ్గర మంచి విజయంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'పెళ్లిచూపులు' అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులను డా సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి రెండు జాతీయ చలనచిత్ర అవార్డులు లభించాయి. ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రంగా 'పెళ్లిచూపులు' జాతీయ పురస్కారం అందుకోగా, ఉత్తమ మాటల రచయితగా దర్శకుడు తరుణ్ భాస్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. అలాగే 2016 సంవత్సరానికి గాను ఉత్తమ చిత్రం, ఉత్తమ నటి విభాగాల్లో రెండు నంది అవార్డులు డా ప్రకటించబడ్డాయి. ఇందులో రీతూ వర్మ ఉత్తమ నటి అవార్డుకు ఎంపికయ్యారు. అయితే ఆ సమయంలో నంది అవార్డుల ప్రదానోత్సవం జరగలేదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర సినీ పురస్కారాల్లో డా 'పెళ్లిచూపులు'కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ చిత్రాన్ని సెకండ్ బెస్ట్ మూవీగా ఎంపిక చేసి చిత్రబృందాన్ని సత్కరించింది. దీంతో విడుదలై పదేళ్లు పూర్తయినా 'పెళ్లిచూపులు' ప్రస్థానం ఇంకా కొనసాగుతూనే ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' యాక్షన్ అదిరింది



మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లోని అత్యంత ప్రజాదరణ పొందిన సూపర్ హీరో ఫ్రాంచైజీల్లో 'స్పైడర్ మ్యాన్' ఒకటి. టామ్ హాల్యాండ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు, విజువల్ ట్రీట్‌తో ఆకట్టుకున్న ఈ చిత్రం కథ, కథన పరంగా ఎంతవరకు మెప్పించిందో చూద్దాం.సినిమా కథ పీటర్ పార్కర్ అలియాస్ స్పైడర్ మ్యాన్ చుట్టూ తిరుగుతుంది. తన శరీరంలో ఊహించని మార్పులు చోటుచేసుకోవడంతో అతడు అయోమయానికి గురవుతాడు. ఇదే సమయంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్యామేజ్ కంట్రోల్'పై అదృశ్య టెలిపతి శక్తి దాడులు చేస్తూ 'వీ మ్యాక్స్ ' కోసం వెతుకుతుంది. అసలు ఆ మిస్టరీ శక్తి ఎవరు? వీ మ్యాక్స్ వెనుక ఉన్న రహస్యం ఏమిటి? దానిని రక్షించేందుకు స్పైడర్ మ్యాన్ చేసే పోరాటమే సినిమా ప్రధాన కథ. సినిమాకు ప్రధాన బలం యాక్షన్ సన్నివేశాలే. ప్రారంభం నుంచే వేగంగా సాగే కథనం ప్రేక్షకులను యాక్షన్ ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ముఖ్యంగా హల్క్‌తో స్పైడర్ మ్యాన్ మధ్య సాగే భారీ పోరాటం, 'ది హ్యాండ్'తో జరిగే స్టైలిష్ ఫైట్స్ థియేటర్లలో మంచి అనుభూతిని కలిగిస్తాయి. విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ కొరియోగ్రఫీ ఈ సన్నివేశాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాయి. టామ్ హాల్యాండ్ మరోసారి స్పైడర్ మ్యాన్ పాత్రలో తనదైన నటనతో ఆకట్టుకున్నాడు. యాక్షన్‌తో పాటు హ్యూమర్, భావోద్వేగాలను సమతూకంగా పలికించాడు. జెండయా కనిపించే సన్నివేశాలు తక్కువే అయినప్పటికీ ఆమె పాత్ర ఆకట్టుకుంటుంది. మార్క్ రఫ్ఫాలో, జాన్ బర్న్థాల్ తమ పాత్రల పరిధిలో చక్కగా నటించారు. నెగెటివ్ షేడ్స్ ఉన్న జీన్ గ్రే పాత్రలో సాడీ సింక్ కనిపించినా, ఆ పాత్రకు ఆశించిన స్థాయిలో బలం తీసుకురాలేకపోయింది. అయితే సినిమా కథనం మాత్రం ఆశించిన స్థాయిలో మెప్పించదు. చిన్న కథను విస్తరించే ప్రయత్నంలో అనేక సన్నివేశాలు నెమ్మదిగా సాగుతాయి. కథలో పెద్దగా ట్విస్టులు లేకపోవడంతో తర్వాత ఏం జరుగుతుందో ముందే ఊహించగలిగే పరిస్థితి ఏర్పడుతుంది. ఎమోషనల్ ట్రాక్‌ను మరింత బలంగా తీర్చిదిద్దే అవకాశం ఉన్నప్పటికీ దర్శకుడు దానిని పూర్తిగా వినియోగించు కోలేకపోయారు. ఫలితంగా కొన్ని కీలక ఘట్టాలు ఆశించిన ప్రభావాన్ని చూపలేకపోయాయి. అలాగే డీడీసీ, వీ మ్యాక్స్ అదృశ్య శక్తికి సంబంధించిన కొన్ని అంశాలకు స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. హల్క్‌కు సంబంధించిన సబ్‌ప్లాట్ కూడా పూర్తిస్థాయిలో ముగియలేదు. పనీషర్, బ్లాక్ విడో వంటి పాత్రలు కథను ముందుకు నడిపే కంటే మార్వెల్ యూనివర్స్ విస్తరణ కోసమే చేర్చినట్లు అనిపిస్తుంది. నెడ్ పాత్రకు కూడా తగిన ప్రాధాన్యం దక్కలేదు. సాంకేతికంగా సినిమా మంచి స్థాయిలో నిలిచింది. దర్శకుడు డెస్టిన్ డేవిడ్ క్రెట్టన్ యాక్షన్ సన్నివేశాలను అద్భుతంగా తెరకెక్కించినప్పటికీ, కథనం విషయంలో మరింత శ్రద్ధ తీసుకుని ఉంటే ఫలితం ఇంకా మెరుగ్గా ఉండేది. బ్రెట్ పావ్లాక్ సినిమాటోగ్రఫీ, మైఖేల్ గియాచినో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు బలంగా నిలిచాయి. విజువల్ ఎఫెక్ట్స్ ఉన్నత స్థాయిలో ఉండగా, జ్యాకీ చాన్ స్టంట్ టీమ్ రూపొందించిన యాక్షన్ కొరియోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. అయితే రెండో భాగంలో కొన్ని సన్నివేశాలను కుదిం చి ఉంటే సినిమా మరింత ప్రభావవంతంగా ఉండేది. మొత్తంగా చూస్తే 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' అద్భుతమైన యాక్షన్, ఆకట్టుకునే విజువల్స్‌తో మార్వెల్ అభిమానులను అలరించే చిత్రం. టామ్ హాల్యాండ్ నటన, గ్రాండ్ యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాకు ప్రధాన బలాలు. కానీ బలహీనమైన కథనం, ఊహించదగిన స్క్రీన్‌ప్లే, అంతగా ఆకట్టుకోని భావోద్వేగాలు సినిమా స్థాయిని కొంత తగ్గించాయి. మార్వెల్ అభిమానులకు ఈ చిత్రం మంచి వినోదాన్ని అందిస్తే, సాధారణ ప్రేక్షకులకు మాత్రం ఒకసారి చూడదగ్గ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుంది.

# ఆదర్శకుటుంబం నుంచి సంపూర్ణ పాత్ర పరిచయం

విక్టరీ వెంకటేష్ దగ్గుబాటి, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' నుంచి చిత్రబృందం మరో ఆసక్తికర గ్లింప్స్‌ను విడుదల చేసింది. రోజుకో కొత్త వీడియోతో సినిమా ప్రచారాన్ని వేగవంతం చేస్తున్న మేకర్స్, తాజాగా ఈ చిత్రంలో వెంకటేష్ తురిగా, చిట్టిబాబు గారాలపట్టిగా నటిస్తున్న సంపూర్ణ (యువినా పార్థవి) పాత్రను పరిచయం చేశారు. పరిచయమైన ప్రతి ఒక్కరితో ప్రేమలో పడే జెన్‌జీ తురి పాత్రలో సంపూర్ణ కనిపించబోతుంది. ఇక త్రివిక్రమ్ మార్క్ సంభాషణలు, వినోదాత్మక ఘట్టాలతో నిండిన ఈ వీడియో సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో నారా రోహిత్, నివేతా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# 8న గ్రాండ్‌గా టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ప్లాన్



యశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. ఈ సినిమా నుంచి భారీ అప్‌డేట్ సిద్ధమైంది. 'టాక్సిక్' చిత్రబృందం ఆగస్టు 8న బెంగళూరులో గ్రాండ్‌గా ట్రైలర్ లాంచ్‌ను ప్లాన్ చేస్తోంది. ట్రైలర్ లాంచ్‌కి ముందు ప్రత్యేక మీడియా సమావేశం ఏర్పాటు చేసి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకోనున్నారు. యశ్‌తో పాటు ఐదుగురు హీరోయిన్లు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను నిర్వహించాలని నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రాన్ని కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ఒసారి చిత్రీకరించారు. ప్రపంచవ్యాప్తంగా 40కి పైగా భాషల్లో డబ్ చేసి విడుదల చేయనున్నారు. ఆగస్టు 26న 'టాక్సిక్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటి విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలు నెట్టింట వైరల్ కాగా.. ట్రైలర్‌తో సినిమా అంచనాలు రెట్టింపు చేయాలని టీమ్ భావిస్తోంది. ఈ సినిమాలో బలమైన ఎమోషన్స్ ఉన్నాయని యశ్ అన్నారు. థియేటర్‌లో అందరూ ఆశ్చర్యపోతారన్నారు. యాక్షన్ సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని.. 'టాక్సిక్'లో హాలీవుడ్ స్టంట్ కోఆర్డినేటర్ జేజే పెర్రీ రూపొందించిన యాక్షన్ సీక్వెన్సులు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని తెలిపారు. ఇందులో ఈ రాకింగ్ స్టార్‌కు జోడీగా తారా సుతారియా, నయనతార, రుక్మిణి వసంత్, కియారా అడ్వాణీ, హ్యూమా ఖురేషీ మెరవనున్నారు.

# రెండు భాగాలుగా అల్లు, అట్లీల రాకా



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్–వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ హీరోయిన్లు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటి అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.

# చిన్ననాటి చేదు అనుభవంతో శివాంగి జోషి భావోద్వేగం



రియాలిటీ షో 'లాకప్ 2' వేదికగా ప్రముఖ టెలివిజన్ నటి శివాంగి జోషి తన చిన్ననాటి జీవితంలో ఎదురైన ఓ బాధాకరమైన సంఘటనను పంచుకుని భావోద్వేగానికి లోనయ్యారు. చిన్నతనంలో కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన ఓ బంధువు తనతో అసభ్యంగా ప్రవర్తించాడని వెల్లడించారు. ఈ విషయాన్ని ఇప్పటివరకు బహిరంగంగా చెప్పలేదని, కానీ పిల్లల భద్రతపై అవగాహన పెంచాలనే ఉద్దేశంతో ఇప్పుడు చెప్పుతున్నట్లు పేర్కొన్నారు. శివాంగి మాట్లాడుతూ.. ''మావయ్య వరుస అయ్యే వ్యక్తి ప్రతిరోజూ నన్ను స్కూల్ నుంచి ఇంటికి తీసుకువచ్చేవాడు. మా అమ్మానాన్న అతడిని పూర్తిగా నమ్మేవారు. ఆ నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని అతడు నాతో అనుచితంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. ఇండస్ట్రీలోకి వెళ్లాలంటే డ్రైవింగ్ నేర్చుకోవాలని, ఇంకా ఎన్నో సంబంధం లేని విషయాలు చెబుతూ నన్ను తన ఒడిలో కూర్చోబెట్టుకునేవాడు. అప్పుడు నాకు ఏం జరుగుతోందో అర్థం కాలేదు. చిన్నపిల్లనని, అమాయకత్వాన్ని అతడు దుర్వినియోగం చేసుకోవాలని చూశాడు'' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో తనపై లైంగిక వేధింపులకు ప్రయత్నించాడని, ఆ విషయం తర్వాత కుటుంబ సభ్యులకు తెలియడంతో అతడిని వెంటనే ఇంటి నుంచి పంపించేశారని శివాంగి తెలిపారు. తల్లిదండ్రులు తనకు అండగా నిలవడంతో ఆ కష్టకాలాన్ని అధిగమించగలిగానని చెప్పారు. ఈ సంఘటన తన జీవితంపై తీవ్ర ప్రభావం చూపిందని, అయినప్పటికీ ధైర్యంగా ముందుకు సాగానని పేర్కొన్నారు. శివాంగి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.